ప్రజాశక్తి

ఆదివారం 29 డిసెంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఉత్సాహంగా... ఉల్లాసంగా...

బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, వేదికపై నాయకులు సిహెచ్.నర్సింగరావు, ఎంవిఎస్.శర్మ, లోకనాథం, జగ్గునాయుడు, గంగారావు తదితరులు

- ఘనంగా సిపిఎం విశాఖ జిల్లా మహాసభ ప్రారంభం
- పెందుర్తి-సుజాతనగర్ ఎరుపుమయం
- భారీ ర్యాలీ, బహిరంగ సభ
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు
- ఆలోచింపజేసిన నేతల ప్రసంగాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో/ పెందుర్తి

ఎర్రజెండాల రెపరెపలతో పెందుర్తి, సుజాతనగర్ ప్రాంతాలు పూర్తిగా ఎరుపెక్కాయి. ఏరోడ్డు చూసినా సిపిఎం విశాఖ జిల్లా 24వ మహాసభల సందడే కనిపించింది. విశాఖలోని ఎన్ఎడి గోపాలపట్నం జంక్షన్ల నుంచి వందల సంఖ్యలో సిపిఎం అభిమానులు, శ్రేణులు, కార్యకర్తలు పోరాట ఎర్రజెండాలను చేతపట్టుకుని వాహనాలపై ర్యాలీగా పెందుర్తికి శనివారం చేరుకోవడంతో రోడ్లపై జనంలో ఒక్కసారిగా తమ దృష్టిని ఎర్రజెండాల వైపు ఆసక్తిగా మరల్చడం కనిపించింది. మహాసభల సందర్భంగా శనివారం ఉదయం 10.30 గంటలకు పెందుర్తి జూనియర్ కాలేజీ నుంచి మహా ప్రదర్శన ప్రారంభమై సుజాతనగర్ జంక్షన్ వరకూ సాగింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు సిహెచ్.నరసింగరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాథం, ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, జిల్లా పార్టీ కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ప్రదర్శనకు అగ్రభాగాన నిల్చున్నారు. పెందుర్తి కూడలి నుంచి సుజాతనగర్ వరకూ చిన్నా, పెద్ద, మహిళలు,

జెండాను ఆవిష్కరిస్తున్న పద్మనాభరాజు

సభకు హాజరైన సిపిఎం కార్యకర్తలు, ప్రజలు

వివిధ తరగతులకు చెందిన కార్మికులు, ఎర్రజెండా అభిమానులు భారీ ఎత్తున ఈ ప్రదర్శనలో పాల్గొని నడవడం విశేషం. కోలాటం, కవాతు, డప్పుల వాయిద్యాలు ప్రదర్శనకు ముందు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ ప్రదర్శన నడుస్తుండగా

మిగతా 2లో..

కుసులవాడ మైనింగ్‌కు అనుమతులొద్దు

▶ వార్త మెయిన్ 2లో..

పంట కుళ్లిపోయినా ఎన్యూమరేషన్ చేయకపోవడం అన్యాయం

▶ వార్త 5లో..

విద్యారంగ పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత : యుటిఎఫ్

▶ వార్త 4లో..

అదిరిన నావికాదళ విన్యాసాల రిహార్సల్స్

▶ వార్త 8లో..

తుంగ్లాంలోని నితీష్‌కుమార్‌రెడ్డి ఇట్టి వద్ద కేక్ కట్ చేస్తున్న కుటుంబీకులు

నితీష్‌రెడ్డి సెంచరీతో..

తుంగ్లాంలో సంబరాలు

వార్త 4లో....

రాజకీయ సంచారం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

సొంత ఆస్తుల్లేక, స్థిరనివాసం లేక బతుకుతెరువు కోసం పిల్లాపాపలతో ఊరూవాడా వెతుక్కుంటూ ఉన్నపాటి సామాన్లతో కావిడి భుజాన వేసుకొని వెళ్లే సంచారజీవులు ఒకప్పుడు ఉండేవారు. కానీ ఇప్పుడు బతకనేర్చిన రాజకీయ సంచారులు అలా కాదు సుమా. కొల్లగొట్టిన ఆస్తిపాస్తులు కాపాడుకోవడానికి, కటకటాలపాలు కాకుండా చూసుకోవడానికి, అనుభవించిన హోదా నిలబెట్టుకోవడానికి, ప్రదర్శిత దర్పం, ఆధిపత్యం పోకుండా రక్షించుకోవడానికి రెప్పపాటులో కావాల్సినకాడికి చేరిపోతున్నారు. బతుకుతెరువు సంచారులకు గమ్యం చేరడానికి కొంత సమయం పడుతుంది. సిగ్గు, బిడియం వదిలేసిన రాజకీయ సంచారులకు క్షణం చాలు. పార్టీ మారడం, క్షణానికొక మాట మాట్లాడ్డం, వెనుకొక మాట, ముందొక మాట, తన పదవీ అధికారం నిలబెట్టుకోవడానికి అసత్యాలు, అర్ధసత్యాలు చెప్పడం, ఎదుటవారిపై బురద జల్లడం, తన సామర్ధ్యాలను ఎక్కువచేసి చూపుకోవడం, విధానానికి కట్టుబడకపోవడం ఈ సంచారులకు వెన్నతోపెట్టిన విద్య. రాజకీయ

సంచారులు వ్యక్తులుగా ఒకచోట నుంచి మరొక చోటకు వెళ్లిపోతే సమాజంపైనా, ప్రజలపైనా పెద్ద ప్రభావం ఉండదు, నష్టం కలగదు. కానీ ప్రజల ఆస్తులు, వనరులకు పరిరక్షకునిగా ఉండాల్సిన సంచారులు ఆస్తులను తన చేతుల్లో పెట్టుకొని వెళ్లిపోతే వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రధానంగా పౌర సమాజంపై ఉంది.

ఈ మధ్య పెద్ద సంచలనానికి, చర్చకు మూలపురుషునిగా మారిన విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్, ఆయన సోదరి యలమంచిలి పురపాలక సంఘం చైర్‌పర్సన్ రమాకుమారి కూటమిలోని బిజెపిలో చేరడం, ఆ పార్టీ చేర్చుకోవడం అనైతిక రాజకీయాలకు అద్దంపట్టేలావుంది. నీతి, నిజాయతీ కల్గిన పార్టీగా చెప్పుకొని... అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆనందకుమార్‌ను పార్టీలోకి చేర్చుకోవడంతో బిజెపిలో ఉన్న నీతి ఏ పాటిదో ఎవరికైనా అర్ధమవుతుంది. విశాఖ డెయిరీ అవినీతిపై శాసనసభా సంఘం విచారణ ప్రారంభించడంతో అవినీతిపరులకు ఆశ్రయమిచ్చి రక్షించే బిజెపి స్థావరంలోకి ఆనందకుమార్ వెళ్లిపోయారు. మూడు లక్షల మందికి పైగా పాల రైతుల ఆస్తులను కొల్లగొట్టినట్లు ఆరోపణలున్నవున్నవారిని పార్టీలో

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

రాజకీయ సంచారం

ఎలా చేర్చుకుంటామన్న ఆలోచన బిజెపి నాయకత్వానికి లేకపోవడం విచారకరం. లక్షల మంది పాలరైతుల మేలు కంటే వారి పాల సొమ్ముతిన్న ఆనందకుమార్ బిజెపికి ముఖ్యుడయ్యాడు.

ఆదారి కుటుంబానికి తెలిసిన రాజకీయ వ్యాపారం మరొకరికి తెలియదేమో. ఎవరినైనా తమ చేతుల్లో పెట్టుకోవడం, ఎలాగైనా తమను తాము రక్షించుకోవడం వారికి తెలిసినట్లు ఇంకొకరికి తెలియదని పలువురునోట ఈ ప్రాంతంలో వింటుంటాం. టిడిపి ప్రభుత్వం పోయిన వెంటనే ఆ పార్టీని వదిలి ఆనందకుమార్ వైసిపిలో చేరారు. ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమిపాలయ్యారు కూడా. తనపై వచ్చిన ఆరోపణల నుంచి తప్పించుకొనే మార్గంలేక వైసిపిని వీడి కూటమిలో ప్రభుత్వంలోని బిజెపి బాట పట్టాడు. ఏ పార్టీలోకి వెళ్లినా తన అంతిమ లక్ష్యం తిన్న పాల రైతుల సొమ్ము కక్కకుండా ఉండడమే. ఇంకా పాల రైతులను ముంచడమేనన్నది జగమెరిగిన సత్యం. తమ సొమ్ము, తమ ఆస్తులను రక్షించుకోవడానికి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పాల రైతులిక రోడ్డెక్కక తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. పార్టీలకతీతంగా విశాఖ డెయిరీ అవినీతి బయటపడేవరకు, తగ్గించిన ఆవుపాల ధర మూడు రూపాయలు పునరుద్ధరించే వరకు రైతుచేసే పోరాటానికి మనస్ఫూర్తిగా చేయూతనివ్వాలి.

ఎన్నికల ముందు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షిస్తామని వాగ్దానం చేసిన కూటమి పార్టీలు అధికారం చేతికొచ్చాక స్వరం మార్చాయి. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని ప్రధాని మోడీని అడగకుండా, వస్తుందో, రాదో తెలీని మిట్టల్ స్టీల్‌కు సొంత గనులు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరడం ఆత్మహత్యాసదృశ్యమే. భవిష్యత్తులో విశాఖ స్టీల్‌ను మరింత నిర్వీర్యం చేసి ప్రయివేటు స్టీల్ మిట్టల్‌కు సహకరించే పనిలో టిడిపి, బిజెపి, జనసేన ఉన్నట్లు కనబడుతోంది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్న డిమాండ్‌ను ఈ ప్రాంత కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడితేకపోవడం క్షమించరానిది.

1 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : జివిఎంసి పరిధిలో జనవరి 1వ తేదీ నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధిస్తున్నట్లు మేయరు గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలో కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్‌తో కలిసి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులపై ప్రత్యామ్నాయాలు ఇన్‌స్పెక్షన్ సిద్ధాంతాలపై స్కిల్ అప్ గ్రేడేషన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ భూతాన్ని విశాఖ నగరం నుంచి తరిమికొట్టాలన్నారు. జివిఎంసి కమిషనర్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం 120 మైక్రాన్ల లోపువున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను నిషేధించినట్లు తెలిపారు.

ఆదర్శ నియోజకవర్గంగా దక్షిణం : ఎమ్మెల్యే వంశీకృష్ణ

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దటమే తన లక్ష్యమని ఎమ్మెల్యే సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. 32వ వార్డు భీమ్ నగర్ ప్రవేశ ఆర్చి, సాయిబాబా, వినాయక ఆలయాల ప్రవేశాల వద్ద నిర్మించిన ఆర్చిలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 32వ వార్డు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ జివిఎంసి నిధులు రూ.15 లక్షలతో ఈ ఆర్చ్‌లను నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇ తేజస్విని, వర్క్ ఇన్‌స్పెక్టర్ గిరిబాబు, కందుల రాజశేఖర్, నారా నాగేశ్వరరావు, సునీల్, మద్ది రాజశేఖర్, అప్పారావు, వెంకటేష్, కుమారి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ప్రజా సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్ తెలిపారు. నగరంలోని 15, 16, 23 వార్డుల్లో శనివారం ఏర్పాటు చేసిన రెవిన్యూ సదస్సుల్లో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబుతో కలిసి ఆయన పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

ఉత్సాహంగా.. ఉల్లాసంగా...

చినముషిడివాడ కూడలి వద్ద సిపిఐ జిల్లా నాయకులు ఆర్.శ్రీనివాసరావు ఆధ్వర్యాన సిపిఎం ర్యాలీకి ఘనంగా పూలతో స్వాగతం పలికారు. కమ్యూనిస్టు పార్టీలదే భవిష్యత్ అని, ఎర్రజెండా పార్టీలు వర్ధిల్లాలని నినాదాలు చేశారు. ప్రదర్శన, అనంతరం పెందుర్తి జోన్ కార్యదర్శి బి జగన్ అధ్యక్షతన బహిరంగ జరిగింది.

స్వతంత్ర రాజకీయ శక్తిగా తీర్చిదిద్దడమే లక్ష్యం: సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

సిపిఎం విశాఖ జిల్లా 24వ మహాసభల ప్రారంభ సూచికంగా సుజాతనగర్ 80 అడుగుల రహదారిపై జరిగిన బహిరంగ సభలో హాజరైన వారినుద్దేశించి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, స్వతంత్ర రాజకీయ శక్తిగా, ప్రధాన రాజకీయ శక్తిగా ఎదిగేందుకు ఎత్తుగడలను రూపొందించడమే మహాసభల్లో చర్చించనున్నట్లు చెప్పారు.

పంచగ్రామాల భూములపై ప్రజలకు హక్కులివ్వాలి : సిహెచ్.నరసింగరావు

పంచగ్రామాల ప్రజలు 20 ఏళ్లుగా పోరాడుతుంటే ప్రభుత్వాలు వీరికి పట్టాలివ్వకుండా అదానికి అడవులు, ఏజెన్సీలో గనులు, ఆర్సెల్ మిట్టల్‌కు 5వేల ఎకరాల స్థలాలు ఎలా ఇస్తున్నారని సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు సిహెచ్.నరసింగరావు ప్రశ్నించారు. రెవెన్యూ భూములను సింహాచలం దేవస్థానంలో కలిపేశారన్నారు. పరిష్కారం కావాలంటే భూమికి భూమి పరిహారం ఇవ్వాల్సి ఉంటుందని మధురవాడలో చూశారన్నారు. అయితే అప్పట్లో మంత్రిగా ఉండే కొణతాల, ఈ ప్రాంత ఎమ్మెల్యే గురుమూర్తిరెడ్డి కలిసి అడ్డం పడ్డారని, లేదంటే 2004 ఆగస్టులోనే సమస్య పరిష్కారం అయ్యేదని తెలిపారు. పంచగ్రామాల ప్రజలు ఎర్రజెండా వెంట ఉంటే పరిష్కారం ఖాయమని భరోసా ఇచ్చారు.

పాలకుల పాపాలకు రోజులు దగ్గరపడాలంటే ప్రజలకు నిజాలు తెలియాలి: మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రూ.1750కోట్లు అదానితో సోలార్ విద్యుత్ ఒప్పందంలో అవినీతికి పాల్పడిన విషయాన్ని అమెరికన్ ఫెడరల్ బ్యాంకు బయటపెట్టిందని ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ తెలిపారు. ఈ విషయమై ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని జగన్ నాశనం చేస్తున్నాడంటూ విరుచుకుపడి అధికారం వచ్చాక ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని చంద్రబాబును ప్రశ్నించారు. మోడీ పల్లకీని బాబు, జగన్ మోసేవారేనన్నారు. ఈ నిజాలు తెలియకుండా మీడియాను కార్పొరేట్లు, ప్రజలను మీడియా నియంత్రిస్తుందని, నిజాలు తెలియజెప్పడమే సిపిఎం పని అన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై వైఖరి చెప్పకుండా విశాఖ వస్తే అడ్డుకుంటాం : కె.లోకనాథం

జనవరి 8న విశాఖకు మోడీ వస్తున్నారని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేయడం లేదని మోడీచేత విశాఖ ఎంపీ భరత్ చెప్పిస్తేనే ఇక్కడ అడుగుపెట్టనిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం స్పష్టంచేశారు. సిపిఎం జిల్లా నాయకులు బి పద్మ మాట్లాడుతూ, పేదల చేత ఎర్రజెండాలు పట్టించి ఇళ్లపట్టాలు సాధించిన చరిత్ర సిపిఎంకుందన్నారు.

మహాసభల్లో పలు తీర్మానాలు : జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ సహా విశాఖలో ఆస్తిపన్ను, చెత్తపన్ను, పేదలకు 2 సెంట్ల భూమి, కొండవాలు ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు, పంచగ్రామాల సమస్య పరిష్కారం కోసం పలు తీర్మానాలు 2 రోజుల మహాసభల్లో చేపడతామన్నారు. 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, చెత్తపన్ను రద్దుచేసినట్టు కూటమి నేతలు చెబుతున్నా దీనికి సంబంధించిన జీవోను చంద్రబాబు ప్రభుత్వం ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రపంచ బ్యాంకు రుణం తీసుకుని చెత్తపై పన్ను తిరగదోడే అవకాశాలు లేకపోలేదన్నారు.

ప్రతినిధుల సభ ప్రారంభం

బహిరంగ సభ అనంతరం జి.సుబ్బారావునగర్, జి.సన్యాసిరావు ప్రాంగణంలో ప్రతినిధుల సభ ప్రారంభమైంది. పార్టీ జెండాను సీనియర్ నాయకులు వివిఎస్.పద్మనాభరాజు ఆవిష్కరించారు. అమరవీరులకు అందరూ నివాళ్లర్పించారు. ప్రతినిధుల సభకు బి.పద్మ, పి.వెంకటరెడ్డి, పైడిరాజు, తౌడన్న అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. కార్యదర్శి నివేదికను ఎం.జగ్గునాయుడు ప్రవేశపెట్టారు.

కార్యదర్శి నివేదికను ప్రవేశపెడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

దీనిపై ప్రాంతాలవారీగా, రంగాలవారీగా చర్చలు జరిగాయి.

ప్రజా సమస్యలపై ఐక్య పోరాటాలు : సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు

ప్రజా సమస్యలపై ఐక్య పోరాటాలు చేద్దామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా మహా సభ నేపథ్యంలో విచ్చేసిన ఆయన సౌహార్ద సందేశమిచ్చారు. మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నానాటికీ పెరుగుతున్నాయన్నారు. వాటిని ఐక్య పోరాటాలతో తిప్పికొట్టాలని, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు మరింత ఉధృత పోరాటాలను వామపక్షాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. విశాఖ అందుకు నాంది కావాలన్నారు.

సౌహార్ద సందేశం ఇస్తున్న సిపిఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై వైసిపి ఆందోళన వాయిదా

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.2800 కోట్లు, వసతి దీవెన బకాయిలు రూ.1100 కోట్లు కలిసి మొత్తం రూ.3900 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జనవరి 3వ తేదీన కలెక్టరేట్ల వద్ద నిరసన కార్యక్రమాలకు వైసిపి పిలుపిచ్చిందని, విద్యార్థుల పరీక్షల కారణంగా ఈ కార్యక్రమాన్ని జనవరి 29వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ వెల్లడించారు. విశాఖలో మీడియాతో మాట్లాడిన ఆయన అప్పటిలోగా ప్రభుత్వం విద్యార్థులకు డబ్బులు విడుదల చేయాలని కోరారు. ప్రజలపై వేసిన విద్యుత్ ఛార్జీల భారాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

విశాఖపట్నం, దువ్వాడ స్టేషన్లలో తనిఖీలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ నేతృత్వంలో శనివారం విశాఖపట్నం, దువ్వాడ స్టేషన్లలో రైల్వే సౌకర్యాలపై తనిఖీ నిర్వహించారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ప్రస్తుత సౌకర్యాలు, కొనసాగుతున్న అభివృద్ధి ప్రాజెక్టులను సమీక్షించారు. జ్ఞానాపురం వైపు స్టేషన్ పునరభివృద్ధి పనుల పురోగతిపైనా, ప్రాజెక్టు అమలు వ్యూహాలపై గతిశక్తి అధికారులతో చర్చించారు. అనంతరం దువ్వాడ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. విశాఖపట్నం-గోపాలపట్నం, సింహాచలం నార్త్-దువ్వాడ, గేట్ జంక్షన్-వడ్లపూడి మధ్య మూడు, నాలుగో లైన్ పనుల పురోగతిని పర్యవేక్షించారు.

విజయవంతంగా ఐటిడిసి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఐటిడిసి-2024 పేరిట అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు, ద డ్యాన్స్ ఇండియా ఆంగ్ల మాసపత్రిక సంపాదకులు బత్తిన రంగ విక్రమ్ కుమార్(గౌడ్) సారథ్యంలో రెండు రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ సంప్రదాయ నృత్య సమ్మేళనం రెండో రోజైన శనివారం విజయవంతంగా కొనసాగింది. రెండో రోజు ఉత్సవాలను జాతీయ అంతర్జాతీయ నృత్యోత్సవ నిర్వహణా నిపుణులు సాయి వెంకటేష్, జగబంధు జెనా, కాశ్మీరా త్రివేదీ, డాక్టర్ కళకృష్ణ, డాక్టర్ కేశవరాజు బాలకృష్ణన్, డాక్టర్ పి.రమాదేవి, ప్రారంభించారు. అనంతరం ఆడిటోరియంలో నిర్వహించిన పోటీలకు డాక్టర్ సజని వల్లభనేని, కేశవరాజు బాలకృష్ణన్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ప్రముఖ యువ కూచిపూడి నర్తకీమణులుగా పేరొందిన బత్తిన సిస్టర్స్ తేజశ్రీ, భాగ్యశ్రీ ఈ పోటీలకు నిర్వాహకులుగా వ్యవహరించారు. కూచిపూడి, భరతనాట్య రీతులలో సీనియర్, జూనియర్, గ్రూప్, సోలో విభాగాలలో నిర్వహించిన ఈ పోటీలలో 33 మంది/బృందాలు తమ నైపుణ్యాలతో ఆడిటోరియం ప్రేక్షకుల్ని మైమరపించారు.

ఎటి.కాలేజీ పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విశాఖ నగరంలో మొట్టమొదటి ప్రైవేట్ పాఠశాల అయిన అన్నపూర్ణేశ్వరి ట్యుటోరియల్ కాలేజ్ 1998 ఎస్ఎస్‌సి బ్యాచ్ పూర్వ విద్యార్థుల కలయిక శనివారం బీచ్ రోడ్‌లోని పార్క్ హోటల్‌లో నిర్వహించారు. ఎటి.కాలేజీ పూర్వ విద్యార్థి, ఐసిఎంఆర్ శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమానికి కాలేజీ పూర్వ విద్యార్థి, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బేదాళం అశోక్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి హాజరైన వైస్ ప్రిన్సిపల్ దంపతులు ప్రసాద్ మాస్టారు, ఇతర ఉపాధ్యాయులు వరలక్ష్మి, సుబ్బారావు, ఎస్.లక్ష్మి, బాలసత్యవతితో పాటు శాసనసభ్యులు బేదాళం అశోక్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 40 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జి మేళాకు స్పందన

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఎంవిపి కాలనీ ఎఎస్.రాజా కాలేజ్ క్రీడా మైదానంలో సరస్ ఉత్సవ్ ఎస్‌హెచ్‌జి మేళాకు విశేష స్పందన లభించిందని జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ శనివారం తెలిపారు. ఇప్పటివరకు 40 వేల మంది మేళాను సందర్శించారని, దాదాపు రూ.40 లక్షల వరకు వ్యాపారాలు జరిగినట్లు తెలిపారు. ఆదివారం ముగింపు సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళా సంఘాలు, ప్రజలు పాల్గొని స్వయం సహాయక సంఘాల వారికి చేయూతనివ్వాలని ప్రజలకు కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

నా పేరు మార్చబడింది

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా నా యొక్క పాత పేరు **ఆకుల చలం S/o** సింహాద్రి **D. No. 29-13-33, F-503, 5th ఫ్లోర్, శక్తిశ్రీ హైట్స్**, దాబాగార్డెన్స్, విశాఖపట్నం - 20. ప్రస్తుతం నా పేరును (కొత్త పేరు) **ఆకుల సింహాచలంగా** మార్చబడింది. ఇక నుండి నా పేరు **ఆకుల సింహాచలంగా** పరిగణించండి.

తమ విధేయుడు,
ఆకుల సింహాచలం

MISSING DOCUMENTS

I KUPPILI NAGAMANI W/o K. GOVINDARAO, D.No. 3-17/4 Aganampudi I 21.12.2024 when Travelling From Gajuwaka To Aghanampudi On Bus I Lost My Original Sale deed No: 1519/1999.

9505831462

రైఫిల్ షూటింగ్‌లో మనోజ్ఞ ప్రతిభ



మనోజ్ఞను అభినందిస్తున్న కాలేజీ డీన్ సుధాకర్, తదితరులు

ప్రజాశక్తి -తగరపువలస: ఎన్‌టిఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన రైఫిల్‌షూటింగ్ పోటీల్లో తమ కాలేజీ ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం విద్యార్థినిమెట్ల శ్రీముఖ రజిని మనోజ్ఞ మంచి ప్రతిభ కనబరిచి అంతర విశ్వవిద్యాలయాల జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందని సంగివలస ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఆర్‌గున్నాజీ శనివారం తెలిపారు వచ్చేనెల 8 నుంచి 18 వరకు చండీగఢ్ పంజాబ్ యూనివర్సిటీ ఆవరణలో ఆలిండియా అంతర విశ్వ విద్యాలయాల ఛాంపియన్ షిప్ పోటీలు జరగనున్నాయి.10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో పోటీలకు ఎంపికైన శ్రీముఖ రజిని మనోజ్ఞను కళాశాల డీన్ డాక్టర్ పివి సుధాకర్, ఎఒ పి శివప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ గున్నాజీ అభినందించారు

సైన్స్ ఎగ్జిబిషన్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఏపి పాఠశాల విద్య, సమగ్రశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి వచ్చేనెల 3 వరకు ఆరిలోవ, తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే పాఠశాల, మండల, జిల్లాస్థాయి జనరల్ సైన్స్‌ఫెయిర్, బుక్‌ఫెయిర్, క్విజ్ పోటీలను సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్ కుమార్ తెలిపారు. శనివారం ఆరిలోవ తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా, మండల విద్యాశాఖాధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 30న పాఠశాల, 31న మండల, జనవరి 3న జిల్లా స్థాయి పోటీలు నిర్దేశిత పాఠశాలల్లో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమం విజయవంతానికి అందరూ సహకరించాలని కోరారు.

చిన్నారులకు వ్యాక్సినేషన్

ప్రజాశక్తి- గాజువాక : గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం వ్యాక్సినేషన్ డే నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ సుధాకర్, పి.నాగఅప్పారావు ఆధ్వర్యంలో చిన్నగంట్యాడ ఎస్‌సి కాలనీలో 100 మంది పిల్లలకు వ్యాధినిరోధక టీకాలను వేశారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ మేళాకు మంచి స్పందన

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక శ్రామికనగర్ ఎంవిఆర్ కళాశాలలో శనివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. 15 కంపెనీల ప్రతినిధులు పాల్గొని, ఇంటర్వ్యూలు నిర్వహించగా, 350మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంవిఆర్ కళాశాల ప్రిన్సిపల్ ఎ.బాలకృష్ణ తెలిపారు. టెక్నికల్, నాన్ టెక్నికల్ విభాగాల్లో పలువురు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసిన ఆయా సంస్థల ప్రతినిధులు, రూ.1.80లక్షల నుంచి రూ.4.40లక్షల వార్షిక ప్యాకేజీ ప్రకటించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ వి.తేజేశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ ఎన్‌వి.కృష్ణ, ప్లేస్‌మెంట్ అధికారి వి.వి.నాగేశ్వరరావు, జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ వై.ఈశ్వరరాజు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతో ఉద్యోగికి గుర్తింపు

ప్రజాశక్తి- గోపాలపట్నం : విధినిర్వహణలో అందించిన ఉత్తమ సేవలే ఉద్యోగికి గుర్తింపునిస్తాయని తహశీల్దార్ సిహెచ్‌వి.రమేష్ అన్నారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో టైపిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తించి, ఉద్యోగోన్నతిపై భీమిలి ఆర్‌డిఒ కార్యాలయంలో ఇ-డివిజనల్ మేనేజర్‌గా వెళుతున్న వంశీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సువర్ణభాయి, ఎఆర్ఐ కె.కోమలి, సర్వేయర్ రాజగోపాల్, విఆర్ఒలు సుబ్రహ్మణ్యం, నవీన్, రాము నాయుడు, జూనియర్ అసిస్టెంట్ రోహిత్, విఆర్ఒలు, విఆర్ఎలు పాల్గొన్నారు.

'గీతం' పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- 'హోం కమింగ్' పేరిట ఘనంగా ఉత్సవాలు

గీతం కార్నివాల్‌కు హాజరౌతున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి -మధురవాడ : 'హోం కమింగ్' పేరిట గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని శనివారం గీతం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు ప్రారంభించారు. దేశ విదేశాలలో స్థిరపడిన గీతం పూర్వ విద్యార్థులు పెద్దఎత్తున కార్నివాల్‌కు తరలి వచ్చారు. ఈ సందర్భంగా గీతం ప్రగతిని, భవిష్య ప్రణాళికలను వివరించారు. పూర్వ విద్యార్థులు గీతం ప్రగతిలో పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం స్టూడెంట్ లైఫ్ డీన్ బాలకుమార్, వివిధ కళాశాలల డీన్‌లు పాల్గొన్నారు.

ఈ ఏడాది పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ప్రముఖ సంస్థలలో ప్రతిభను చాటుతూ కీలక స్థానాలకు ఎదిగిన పలువురు గీతం పూర్వ విద్యార్థులను అవార్డులతో సన్మానించారు. పారిశ్రామికవేత్తగా ఎదిగిన గీతం పూర్వవిద్యార్థి, గీతంకు విశిష్ట సేవలు అందించిన ఒ.నరేష్ కుమార్, పలాస ఎమ్మెల్యే గౌతు.శిరీష, ప్రముఖ ఎడోబ్ కంపెనీలో బిజినెస్ ఆపరేషన్స్‌లో డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న జి.గిరీష్, డిజైన్ కన్సల్టెంట్ గా రాణిస్తున్న ఎమ్.అమిత్‌లకు విశిష్ట పురస్కారాలను అందజేశారు.

సమ్మేళనంలో భాగంగా విద్యార్థుల సాంకేతిక ఉత్పత్తుల ప్రదర్శన, క్రీడా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. గీతం పూర్వ విద్యార్థుల రాకతో ఇంజనీరింగ్, ఫార్మసీ, సైన్స్, మేనేజ్‌మెంట్, దంత వైద్య విభాగాలలో అధ్యాపకులతో ముఖాముఖి నిర్వహించారు. పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో సహ హాజరు కావడంతో గీతం ప్రాంగణంలో వినోదాన్ని పంచే స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. మూడేళ్లుగా గీతం విశాఖ, హైదరాబాద్ ప్రాంగణాలలో క్రమం తప్పకుండా 'హోం కమింగ్' పేరిట నిర్వహిస్తున్నామని గీతం పూర్వ విద్యార్థుల సంఘం డిప్యూటీ డైరెక్టర్ పి.నవీన్ తెలిపారు.

శిశు మరణాల నియంత్రణలో పిడియాట్రిక్ సర్జన్లదే కీలకపాత్ర

క్లిష్టమైన సర్జరీలు చేసుకున్న చిన్నారులకు సత్కారం

ప్రజాశక్తి - ఆరిలోవ : శిశు మరణాల రేటు తగ్గించడంలో పిడియాట్రిక్ సర్జన్ల పాత్ర చాలా కీలకమని రెయిన్‌బో ఆసుపత్రి పిడియాట్రిక్ సర్జన్ల వైద్యబృందం తెలిపింది. జాతీయ పిల్లల శస్త్రచికిత్స దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆరిలోవ హెల్త్‌సిటీ రెయిన్‌బో ఆసుపత్రిలో శనివారం క్లిష్టమైన శస్త్రచికిత్సలు చేయించుకొని విజయం సాధించిన చిన్నారులను ఘనంగా సత్కరించారు.. ఈ ఏడాది రెయిన్ బో ఆసుపత్రిలో పుట్టుకతో వచ్చిన సంక్లిష్టమైన లోపాలను శస్త్రచికిత్సల ద్వారా విజయవంతంగా సవరించిన 15 మంది చిన్నారులను, తల్లిదండ్రులను రెయిన్‌బో పిడియాట్రిక్ సర్జన్ల వైద్యబృంద అభినందించింది. ఈ సందర్భంగా రెయిన్‌బో పిడియాట్రిక్ యూరాలజీ స్పెషలిస్ట్, ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ హిమజ రావి మాట్లాడుతూ భారతదేశంలో పుట్టుకతో సంభవించే లోపాలను కారణంగా శిశు మరణాల రేటు 10 నుంచి 20 శాతం ఉన్నట్లు పరిశోధనలు వెల్లడిస్తున్నాయన్నారు. శిశు మరణాల రేటును తగ్గించడంలో పిడియాట్రిక్ సర్జన్ల పాత్ర కీలకమన్నారు. ఇటీవల కాలంలో పిల్లల్లో మూత్ర సంబంధిత వ్యాధులు ఎక్కువగా ఉంటున్నాయని, వీటిపై ప్రజల్లో అవగాహన అవసరమన్నారు. పుట్టుకతో పిల్లలలో మూత్ర విసర్జన సమస్యలుంటే సంబంధిత వైద్యులను తప్పక సంప్రదించాలన్నారు. రెయిన్‌బో ఆసుపత్రిలో 27 వారాలు నిండకుండా జన్మించిన ప్రిమెచ్యూర్ బేబీకి పేగులోని రంధ్రాలకు క్లిష్టమైన శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ప్రతిభావంతులైన వైద్యనిపుణులు ఎల్లప్పుడూ రెయిన్‌బో ఆసుపత్రిలో అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీలత, డాక్టర్ శ్రీకాంత్, యశ్వంత్, డాక్టర్ సతీష్ పాల్గొన్నారు.

రుచిగా..శుచిగా...

మాస్టర్ చెఫ్ పోటీల్లో విద్యార్థుల సందడి

తల్లిదండ్రులతో కలిసి వంటకాల తయారీ

తల్లిదండ్రులతో ఆహారపదార్థాల తయారీలో చిన్నారులు

ప్రజాశక్తి - తగరపువలస : స్థానిక శ్రీ బాసర లీడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం మాస్టర్ చెఫ్ పోటీలు సందడిగా సాగాయి. తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులు వివిధ రకాల ఆహారపదార్థాలను తయారుచేశారు. మురి మిక్చర్, ఫ్రూట్ సలాడ్, శాండ్ విచ్, బ్రెడ్ కబాబ్, రాగి మాల్ట్, దోసకాయ బోట్ సలాడ్, చాక్లెట్ డోనట్స్ తదితర శుచి, రుచికరమైన వంటకాలను తయారు చేశారు.ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ పూడి రమేష్ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించారు. తమ స్కూల్‌లో ప్రాథమిక స్థాయి విద్యార్థుల కోసం ఇటీవల ప్రారంభించిన 'మాస్టర్ చెఫ్' కార్యక్రమంలో భాగంగా ఈ తరహా కార్యక్రమం నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో డీన్ భాస్కరరావు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు రేఖ, కేశవ మూర్తి , బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్‌ను తనిఖీ చేసిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి- సీతమ్మధార : నగరంలోని కణితి, విద్యుత్‌నగర్ యుపిహెచ్‌సిలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా ఆసుపత్రుల్లో వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. యుపిహెచ్‌సిల్లో ఒపి, ఐపి విభాగాలను, ఇహెచ్ఆర్, ఇ-ఔషధి, ఎన్‌సిడి. 3.0 సర్వే రిపోర్టును సమీక్షించారు. వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది హాజరును పరిశీలించారు. సమయపాలన పాటించాలని, ఎటువంటి ఆరోపణలు లేకుండా రోగులకు వైద్యసేవలు అందించాలని సూచించారు. మాతాశిశు సంరక్షణ చర్యల్లో భాగంగా ఆసుపత్రి ప్రసవాలను ప్రోత్సాహించాలని ఆదేశించారు. ఆర్‌బికెఎస్.స్కూల్ విజిట్స్, ఎడబ్ల్యుసి స్క్రీనింగ్‌ను సమీక్షించి, అభ ఐడి మ్యాపింగ్ శతశాతం సాధించాలని ఆదేశించారు. పర్యటనలో డిపిఎంఒ డాక్టర్ బి.ఉమావతి, బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడి హత్య

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక పాత బస్టాండ్‌లో శుక్రవారం రాత్రి ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం... చోడవరం రెల్లి వీధికి చెందిన సమాధుల ప్రేమ్ కుమార్ (32), డి.దుర్గాప్రసాద్ మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో పూటుగా మద్యం తాగి ఉన్న డి.దుర్గాప్రసాద్ ప్రేమ్‌కుమార్‌పై కర్రతో దాడి చేశారు. దీంతో ప్రేమ్ కుమార్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. దీనిపై చోడవరం పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మృతుడు, నిందితుడు ఇరువురు వరసకు మామ అల్లుళ్లు అవుతారని స్థానికులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- నక్కపల్లి : నక్కపల్లి జాతీయ రహదారిపై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందినట్టు ఎస్సై సన్ని బాబు తెలిపారు. నక్కపల్లిలో గురుకుల పాఠశాల సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ తున్న మతిస్థిమితం లేని వ్యక్తిని లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. మృతదేహాన్ని నక్కపల్లి 50 పడకల ఆసుపత్రిలో భద్రపరుస్తామన్నారు.

20 లీటర్లు నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి -మాడుగుల:రావికమతం మండలం చినపాచిలి రామాలయం వీధిలో శుక్రవారం అక్రమంగా తరలిస్తున్న 20 లీటర్లు నాటుసారాతో వ్యక్తిని పట్టుకొని అరెస్ట్ చేసినట్టు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. సిఐ సిహెచ్ ప్రసాద్ ఆధ్వర్యంలో సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి నాటుసారాపై దాడులు జరిపారు. ఈ దాడుల్లో అక్రమంగా తరలిస్తున్న 20 లీటర్ల సారాతో కైగుంట గ్రామానికి చెందిన సాసుబిల్లి రమణని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్టు తెలిపారు.

ఉపాధి కోర్సులతో ఆసరా

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మహిళలు తీరిక సమయాలలో స్వయం ఉపాధి కోర్సులపై దృష్టి సారించి, ఆర్థికంగా నిలబడాలని వన్ టౌన్ సిఐ జిడి బాబు సూచించారు. ఫిషింగ్ హార్బర్‌లోని బాల వికాస ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన జన శిక్షణ సంస్థ సహకారంతో టైలరింగ్ శిక్షణ పూర్తిచేసిన మహిళలకు శనివారం సర్టిఫికెట్లను ఆయన అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మహిళలకు శిక్షణ ఇస్తున్న బాల వికాస ఫౌండషన్ సేవలు అభినందనీయమన్నారు. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గోడే నరసింహాచారి, కస్తూరి వెంకటరావు, బ్రహ్మకుమారి రామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి దొంగ నిరసనలు : గండి బాబ్జీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వైసిపి ప్రభుత్వ హయాంలోనే విద్యుత్ ఛార్జీలు పెంచారని, ఆ పార్టీ వారే ఇప్పుడు విద్యుత్ చార్జీల పెరుగుదలపై నిరసనలు చేయటం దొంగే దొంగ అన్నట్టు ఉందని టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి ఎద్దేవా చేశారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసిపి నేతలు ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేయాలని హితవు పలికారు. పార్టీ నాయకులు వెల్లంకి భరత్ పాల్గొన్నారు

మాధవరావు మృతికి హెచ్ఆర్ఎఫ్ సంతాపం

ప్రజాశక్తి-విశాఖపట్నం : మానవ హక్కుల వేదిక (హెచ్ఆర్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సీనియర్ న్యాయవాది గొర్రెపాటి మాధవరావు మృతిపై వేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెవి.జగన్నాథరావు, వై.రాజేష్ శనివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. నాలుగు దశాబ్దలకుపైగా హక్కుల రంగంలో అలుపెరగని కృషిచేశారని కొనియాడారు. చట్ట సంబంధ అంశాలపై సామాన్యులకు అర్థమయ్యేలా అనేక రచనలు చేశారని వివరించారు. మాధవరావు కుటుంబానికి సానుభూతి తెలిపారు.

వైభవంగా కనకమహాలక్ష్మి రథోత్సవం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు ముగింపు దశకు చేరుకోవడంతో ఆనవాయితీ ప్రకారం శనివారం శ్రీకనకమహాలక్ష్మి రథోత్సవాన్ని అంబికాబాగ్ రామాలయం నుంచి కనకమహాలక్ష్మి దేవస్థానం వరకు నిర్వహించారు. రథయాత్రను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఇఒ శోభారాణి, ఇఇ రమణ పాల్గొన్నారు. తప్పెటగుళ్ళు, కోలాటాలు, పులివేషాలు, కళాశాలతో, సంప్రదాయ నృత్యాలతో రథయాత్ర కోలాహలంగా సాగింది.

ఘనంగా గ్లోబల్ స్కూల్ వార్షికోత్సవం

జ్యోతి ప్రజ్వలనతో వార్షికోత్సవం ప్రారంభిస్తున్న చైర్మన్ బివి.రావు

ప్రజాశక్తి -మధురవాడ : అయోధ్యనగర్‌లోని గ్లోబల్ స్కూల్ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. వినాయకుని స్తుతిస్తూ ప్రార్థనా నత్యంతో ప్రారంభించిన వార్షికోత్సవ వేడుకల్లో ఎల్‌కెజి చిన్నారులతోపాటు ఇతర అన్ని తరగతుల ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.
ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ బివి. రావు మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలను నేర్పిస్తామని, ఆటపాటలకు ప్రత్యేకప్రాధాన్యత ఉంటుందన్నారు. నిబద్ధత, అంకితభావంతో కూడిన విద్యాబోధన వల్ల తమ పాఠశాల విద్యార్థులు చదువుతోపాటు ఇతర రంగాల్లోనూ రాణించి, మంచి గుర్తింపు తెస్తున్నారన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ అనురాధ, ప్రిన్సిపాల్ లలిత, బోధనా సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి -తగరపువలస: జివిఎంసి రెండో వార్డు సంగివలస అమేయా వరల్డ్ స్కూల్‌లో శని వారం 'ఎసెన్స్ – 2024' పేరిట 15వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ మోహన్ మండవ మాట్లాడుతూ, చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. సృజనాత్మకంగా ఆలోచించాలని సూచించారు. గణితం, ఆంగ్లం, సైన్స్ పాఠ్యాంశాలకు సంబంధించి విద్యార్థులు ప్రదర్శించిన పలు నమూనాలు వారి ప్రతిభకు నిదర్శనంగా నిలిచాయి. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించేలా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ అరుణ, ప్రిన్సిపాల్ దేవి పాల్గొన్నారు.

సన్ స్కూల్ చిన్నారుల మానవత్వం

రూ 30 వేలు సాయం అందజేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జివిఎంసి నాలుగోవార్డు బోరపేటకు చెందిన ఇంటర్ విద్యార్థి బి.చందుకు సన్ స్కూల్‌లోని తోటి విద్యార్థులంతా చేదోడుగా నిలిచారు. తలోకొంత విరాళంగా సేకరించి, రూ.30వేలు సమకూర్చి, శనివారం సన్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్ కె.శ్రీనివాసరావులతో కలిసి బాధిత విద్యార్థి చందు, అతని కుటుంబ సభ్యులకు అందజేశారు.కష్టాల్లో ఉన్న తోటి విద్యార్థికి అండగా ఉండాలన్న ఆలోచన కలిగిన విద్యార్థుల మానవత్వం, చొరవను కరస్పాండెంట్, అధ్యాపకులు అభినందించారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -తగరపువలస: సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై జనవరి ఒకటో తేదీ నుంచి పూర్తి నిషేధం అమల్లోకి రానున్న నేపథ్యంలో దానికి ప్రజలు సహకరించాలని జివిఎంసి యంత్రాంగం పిలుపునిచ్చింది. శనివారం తగరపువలస జంక్షన్‌లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు . ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ప్లాస్టిక్‌పై సంపూర్ణ నిషేధానికి చర్యలు చేపట్టనున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గాలను ప్రజలు అన్వేషించాలన్నారు. అతిక్రమిస్తే చట్టపరంగా జరిమానాలు, చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జివిఎంసి ఒకటో జోన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మీనాయుడు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నితీష్‌రెడ్డి సూపర్ సెంచరీతో తుంగ్లాంలో సంబరాలు

కుటుంబసభ్యులు, మిత్రుల హర్షాతిరేకాలు

తుంగ్లాంలో బాణసంచాతో నితీష్ ఇంటి వద్ద సంబరాలు

ప్రజాశక్తి- గాజువాక: ఆస్ట్రేలియాలో మెల్‌బోర్న్ వేదికగా జరుగుతున్న బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియా, భారత్ జట్ల మధ్య నాలుగో టెస్ట్ మ్యాచ్‌లో కష్టాల్లో ఉన్న భారత్ జట్టును సూపర్ సెంచరీతో గట్టెక్కించిన విశాఖ కుర్రాడు కాకి నితీశ్ కుమార్‌రెడ్డిపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. కష్టాల్లోనున్న భారత్‌ను ఫాలోఆన్ గండం నుంచి గట్టెక్కించిన యువ క్రికెటర్ నితీష్‌కుమార్ రెడ్డి స్వగ్రామం తుంగ్లాంలో సంబరాలు అంబరాన్నంటాయి. నితీష్ రెడ్డి నాన్నమ్మ అప్పలకొండమ్మ కేక్ కట్ చేసి సంబరాలను ప్రారంభించగా, కుటుంబ సభ్యులు, స్నేహితులు బాణసంచా కాల్చగా, తీన్మార్ డప్పుల కోలాహలం మధ్య మిఠాయిలు పంచుతూ సంబరాలు చేసుకున్నారు.జివిఎంసి 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి సోదరుడు ముత్యాలరెడ్డి కుమారుడు నితీష్ కుమార్‌రెడ్డి. ఎనిమిదోస్థానంలో బ్యాటింగ్ వచ్చి, సెంచరీతో రికార్డు నెలకొల్పిన నితీష్‌కుమార్‌ను పలువురు అభినందిస్తున్నారు.

విఎంఆర్‌డిఎ చైర్మన్ ప్రణవ్ ప్రశంసలు

ఎంవిపి కాలనీ : మెల్‌బోర్న్ టెస్ట్‌మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టుపై కెరీర్‌లోనే తొలి సెంచరీతో కష్టాల్లో ఉన్న భారత్‌ను విశాఖ కుర్రాడు నితీష్‌కుమార్ రెడ్డి ఆదుకునేలా ఆడడం అద్భుతమని విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ కొనియాడారు. ఆస్ట్రేలియా గడ్డపై అతిపిన్న వయసులో సెంచరీ చేసిన మూడో భారత ఆటగాడిగా రికార్డ్ సాధించడం సంతోషకరమన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని ఉత్తమ ప్రదర్శనలతో భారత జట్టు విజయాల్లో భాగం కావాలని ఆకాంక్షించారు.

జిల్లా కలెక్టర్ అభినందన

విశాఖ కలెక్టరేట్: ఆస్ట్రేలియాతో మెల్‌బోర్న్ వేదికగా జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో సూపర్ సెంచరీతో సత్తాచాటిన విశాఖ యువ క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డికి జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్ అభినందనలు తెలిపారు. ఇదే ఒరవడి కొనసాగించి భవిష్యత్తులో అంతర్జాతీయ క్రికెట్‌లో మరిన్ని ఉత్తమ శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. జిల్లా యంత్రాంగం, ప్రజల తరపున శుభాకాంక్షలు తెలిపారు.

ఎసిఎ నగదు నజరానా

మధురవాడ : మొదటి ఇన్నింగ్‌లో సెంచరీతో భారత్‌ను ఫాలో ఆన్ గండం నుంచి గట్టెక్కించిన నితీష్‌కుమార్ రెడ్డికి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ రూ. 25 లక్షల నగదు బహుమతి ప్రకటించింది. త్వరలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చేతుల మీదుగా అందజేయనున్నట్లు ఆ మొత్తాన్ని అందజేస్తామని ఎసిఎ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, కార్యదర్శి సానా సతీష్ బాబు వెల్లడించారు. బోర్డర్, గవాస్కర్ ట్రోఫీలో నితీశ్ కుమార్‌రెడ్డి ఆల్‌రౌండ్ ప్రతిభతో అద్భుతంగా రాణిస్తుండటం అభినందనీయ మని వారు కొనియాడారు. పిన్నవయస్సులో. ఆస్ట్రేలియాలో, ఆస్ట్రేలియా జట్టుపై రాణిస్తున్న నితీశ్ కుమార్‌రెడ్డి నేటి యువతకు రోల్ మోడల్ అన్నారు. నితీశ్ కుమార్‌రెడ్డి భవిష్యత్తులో మరిన్ని పరుగులు సాధించి అంతర్జాతీయ క్రికెట్‌లో రాణించాలని ఆకాంక్షించారు.

విద్యారంగ పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత

యుటిఎఫ్ విద్యా వైజ్ఞానిక ప్రచార యాత్రలో రాష్ట్ర కార్యదర్శులు మోహనరావు, శ్రీలక్ష్మి

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మోహనరావు

ప్రజాశక్తి -తగరపువలస : విద్యారంగ పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత అని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు రెడ్డి మోహనరావు, వి శ్రీలక్ష్మి స్పష్టం చేశారు. యుటిఎఫ్ ఆవిర్భవించి, 50 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా కాకినాడ పిఆర్ కాలేజీ ప్రాంగణంలో వచ్చేనెల 5 నుంచి 8వరకు నిర్వహించనున్న యుటిఎఫ్ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక స్వర్ణోత్సవ మహాసభలు విజయవంతం చేయాలని కోరుతూ శ్రీకాకుళం నుంచి ప్రారంభమైన ప్రచార యాత్ర శని వారం విశాఖ జిల్లా తగరపువలస చేరుకుంది. ఈ సందర్భంగా యాత్రలో పాల్గొన్న యుటిఎఫ్ ప్రతినిధులకు స్థానిక యూనియన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జెండాను రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రచార యాత్ర ప్రాధాన్యతను వివరించారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిటెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలని, 12వ పిఆర్‌సి, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు.
యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ పోరాటం నిరంతరం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.పైడిరాజు, సహాధ్యక్షులు రొంగలి ఉమాదేవి, ఎన్.ప్రభాకర్, కోశాధికారి కె రాంబాబు, సీనియర్ నాయకులు టి.అప్పారావు, ఎస్ఎస్ నాగమణి, వైఆర్‌కె ప్రసాద్, జిల్లా కార్యదర్శులు ఉప్పాడ రాము, టి జగన్, మహమ్మద్ రిజ్వాన్ పాల్గొన్నారు.ముందుగా స్థానిక జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహానికి యుటిఎఫ్ రాష్ట్ర, స్థానిక నాయకులు, ప్రచారయాత్రలో పాల్గొన్న ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తగరపువలస నుంచి ఆనందపురం, చంద్రంపాలెం మీదుగా ఎన్ఎడి, గాజువాక, కూర్మన్న పాలెం ప్రాంతాల్లో ప్రచార యాత్ర ఉత్సాహపూరితంగా సాగింది

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

సాయం చెక్కును అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - ఆరిలోవ : రోడ్డు ప్రమాదంలో కాలు పోగొట్టుకున్న క్షతగాత్రుడికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.9 లక్షల ఆర్థికసాయం చెక్కును విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అందజేశారు.
11వ వార్డు అన్నానగర్‌లో నివాసం ఉంటున్న రాచకొండ దేవరాజు రోడ్డు ప్రమాదంలో కాలు పోగొట్టుకున్నాడు. ఈ విషయాన్ని ఎంపి శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి దృష్టికి తీసుకు వెళ్లగా వారు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ 9 లక్షల చెక్కును శనివారం బాధితుడు రాచకొండ దేవరాజుకు తన నివాసంలో అందజేసారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు, వార్డు ఇన్‌చార్జ్ ముగడ రాజారావు, మూది అప్పారావు, కృష్ణంరాజు, కలేషా పాల్గొన్నారు.

నేడు అమూల్య భరతనాట్య అరంగేట్రం

మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ వజ్జ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : యునైటెడ్ స్టేట్స్ అమెరికాలోని డల్లాస్ నగరంలో నడుస్తున్న నాట్యం డాన్స్ అకాడమీ సంస్థ శాఖను విస్తరించే క్రమంలో విశాఖ నగరంలో డాక్టర్ వజ్జ ప్రవీణ వద్ద శిక్షణ పొందిన అమూల్య వజ్జ భరతనాట్య అరంగేట్ర కార్యక్రమం ఆదివారం సాయంత్రం 6 గంటలకు వుడా చిల్డ్రన్ ఎరీనాలో ఏర్పాటు చేస్తున్నట్లు డాక్టర్ వజ్జ ప్రవీణ తెలిపారు. శనివారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, అమూల్య తన కుమార్తె అని తెలిపారు. ప్రముఖ నాట్యాచార్యులు అవసరాల రుక్మాజీరావు వద్ద భరతనాట్యంలో తాను శిక్షణ పొందినట్లు వివరించారు. అనంతరం అమెరికాలో నాట్యం డాన్స్ అకాడమీ సంస్థను స్థాపించానన్నారు. నగరంలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

అవగాహనతోనే మహిళా చట్టాల సద్వినియోగం

మహిళా న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి సౌజన్య

ఆనందపురంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి సౌజన్య

ప్రజాశక్తి -ఆనందపురం : ఇంటా బయట మహిళలపై వేధింపులు, అకృత్యాల నుంచి రక్షణకు ఎన్నో చట్టాలున్నాయని, వాటిపై అవగాహన కలిగి సద్వినియోగం చేసుకోవాలని భీమిలి కోర్టు న్యాయమూర్తి డి.సౌజన్య సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా న్యాయమూర్తి సౌజన్య మాట్లాడుతూ, మహిళలు మోసపోకూడదంటే రాజ్యాంగం వారికి కల్పించిన చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అన్యాయం జరిగినప్పుడు న్యాయాన్ని ఆశ్రయించాలన్నారు.ఉచితంగా న్యాయ సలహాలు ఇచ్చి, చట్టపరమైన న్యాయం జరిగేలా సహాయపడేందుకు రాష్ట్ర, జిల్లాస్థాయిలో న్యాయాధికారుల సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా మహిళాచట్టాలపై సమగ్రంగా వివరించి, చైతన్యపరిచారు.కార్యక్రమంలో ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్టు అధికారి జయదేవి, సిడిపిఒ శ్రీదేవి, ప్యానల్ అడ్వకేట్స్ స్వర్ణ గౌరీ, రవిశంకర్, ఎపిఎం రత్నం, ఉమా జానకి పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో స్థానిక కోర్టు న్యాయమూర్తి సౌజన్య పాల్గొని,మహిళలకు రాజ్యాంగ పరంగా పొందుపర్చిన హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు.మహిళా కమిషన్ సభ్యులు జయశ్రీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి జి జయదేవి, సిడిపిఒ ఎం.శ్రీదేవి, ఎంపిడిఒ ఎస్.హనుమంతరావు పాల్గొన్నారు.

వరి పంట కుళ్లిపోయినా ఎన్యూమరేషన్ చేయకపోవడం అన్యాయం

- తక్షణమే ఎకరాకు రూ.30వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలి
- సిపిఎం, రైతు సంఘం నేతలు కోటేశ్వరరావు, అప్పారావు

ప్రజాశక్తి-రాంబిల్లి

వర్షపు నీటితో ముంపునకు గురై వరి పంట కుళ్లిపోగా, సంబంధిత అధికారులు ఎన్యూమరేషన్ చేయకపోవడం అన్యాయమని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు అన్నారు. రాంబిల్లి మండలం మర్రిపాలెం, రజాల గ్రామాల పరిధిలో తుపానుల కారణంగా వరి పంట ముంపుకు గురైన ప్రాంతాలలో శనివారం వారు పర్యటించారు. నేటికీ నీటిలోనే ఉండి కుళ్లిపోయిన వరి పంటను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు, అప్పారావు మాట్లాడుతూ నెల రోజుల వ్యవధిలో వరుసగా వచ్చిన తుపానుల కారణంగా రైతులకు అపార నష్టం జరిగిందన్నారు. చేతికొచ్చిన పంట తీసుకునే సమయంలో నీటిపాలైపోయిందని రైతులు తమ వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. రాంబిల్లి మండలంలోని మర్రిపాలెం, రజాల గ్రామాల పరిధిలో సుమారుగా 200 నుండి 300 ఎకరాల వరి పంటకు నష్టం వాటిల్లిందని తెలిపారు. వారం రోజుల్లో కోత కోయాల్సిన పంట తుఫాను కారణంగా ఈదురు గాలులకు నేలకొరిగిందని, వర్షపు నీరు మొత్తం ఆ పంట మీద నుండి ప్రవహించిందని, ఆ పంట నేటికీ నీటిలోనే ఉండడంతో కుళ్లిపోయిందని చెప్పారు. ఎకరాకు సుమారు రూ.30వేలు పెట్టుబడి పెట్టిన రైతు పంట చేతికి రాకపోవడంతో చేసిన అప్పులు తీర్చడం, బతకడం ఎలా అని రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఇంత నష్టం జరిగినప్పటికీ మండల వ్యవసాయ శాఖ అధికారులు కనీసం పర్యటించి ఎన్యూమరేషన్ చేయకపోవడం దారుణమన్నారు. ఈ సమస్యపై అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే తుఫాను కారణంగా నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.30 వేలు చొప్పున నష్టపరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని, కేంద్రం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అదనంగా క్వింటాకు రూ.500 ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జి దేవుడు నాయుడు, సిఐటియు మండల కన్వీనర్ చందక రామకృష్ణ, బాధిత రైతులు సమ్మెట్ల రాము, ఇల్లా గంగాధర్ రావు, మడగల అప్పారావు, మడగల శ్రీను బాబు, ఎరికిరెడ్డి శ్రీను, ఉప్పల వట్టి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

నేటికీ నీటిలో ఉండి కుళ్లిపోయిన వరి పనలను చూపుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, రైతులు

మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

మన్మోహన్ సింగ్ సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : కీర్తిశేషులు మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ రాజకీయాలకు అతీతంగా దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ కొనియాడారు. లాసన్స్ బే కాలనీలోని తన కార్యాలయంలో మన్మోహన్ సింగ్ చిత్ర పటం వద్ద వైసిపి నాయకులతో కలిసి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు, మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక దైట్ ఇంజనీరింగ్ కళాశాల, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక సంస్కరణల చరిత్రలో కీలక పాత్ర పోషించిన ఈ మహోన్నత నాయకుని సేవలను స్మరించుకోవడం సముచితమన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె.గణేష్, ప్రసాద్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె. మోహన్ రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్, పిడిఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అనకాపల్లి కోడిగంటి గోవిందరావు భవనంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.2100 కోట్లు, వసతి దీవెన రూ.1480 కోట్లు విడుదల చేయాల్సి ఉందని చెప్పారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు జీవో నెంబర్ 77ను రద్దు చేయాలన్నారు. ఈనెల 30న విజయవాడలో జరగనున్న పోరు దీక్షను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జి, వైసిపి విద్యార్థి విభజన విభాగం నాయకులు హరికృష్ణ, కుమార్, పిడిఎస్‌ఓ నాయకులు రుద్ర, ఏఐఎస్ఎఫ్ నాయకులు జగదీష్ సింహాద్రి రాజు తదితరులు పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-సబ్బవరం : మండల కేంద్రంలో శివాలయం నిర్మాణంలో భాగంగా స్టీల్‌గేటు నిర్మాణానికి సబ్బవరం పంచాయతీ, దుర్గానగర్ కోలనీకి చెందిన మంగళగిరి సంతోష్ దంపతులు రూ.30,116 విరాళాన్ని శనివారం ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బర్ల రమణ, గెద్దం కృష్ణ, దంగేటి నాని, దంగేటి ప్రకాష్, మాజీ సర్పంచ్ దనిమిరెడ్డి శ్రీనివాసరావు, ఉగ్గిన రాము, పెన్నం శ్రీనివాసరావు, కొల్లి కృష్ణ, పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి-మునగపాక : పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మండలంలోని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు పేర్కొన్నారు. మూలపేట గ్రామంలో రోడ్డుకి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు, స్మశాన వాటికలోని మట్టి దిబ్బలను శనివారం జెసిబి సహాయంతో శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యంతో పాటు వీధిలైట్లు, తాగునీటిపై పంచాయతీ పాలకవర్గం ఎప్పటికప్పుడు ప్రత్యేక దృష్టి సారిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మొల్లేటి గంగాధర్, వార్డు మెంబర్లు ఆడారి సత్యనారాయణ, ఆడారి అమ్మాజీ, కాండ్రేగుల శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు కాండ్రేగుల నాగేశ్వరరావు, బొడ్డెడ ఆదికుమార్, ఆడారి మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలు తొలగింపును పరిశీలిస్తున్న సర్పంచ్

ఎస్‌వి డ్రగ్స్ ఉద్యోగి కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఎస్‌వి డ్రగ్స్‌లో పనిచేస్తూ మృతి చెందిన ఎన్.కృష్ణచైతన్య కుటుంబానికి న్యాయం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము డిమాండ్ చేశారు. నవంబర్ 28న పరిశ్రమలో కృష్ణచైతన్య ప్రమాదవశాత్తు పడిపోయి చికిత్స పొందుతూ ఈనెల 5న కేజీహెచ్‌లో మృతి చెందినట్లు తెలిపారు. కృష్ణ చైతన్యకు సరైన వైద్యం అందక మృతి చెందాడని పేర్కొన్నారు. మృతి చెంది నేటికీ 23 రోజులైనా నేటి వరకు ఆ కుటుంబానికి ఎటువంటి పరిహారం అందజేయలేదని ఆవేదన చెందారు. ఉద్యోగి కుటుంబాన్ని ఆదుకోవాలని పరిశ్రమ వద్దకు వెళ్లి కుటుంబీకులు ప్రాధేయపడినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. కృష్ణ చైతన్య కుటుంబానికి న్యాయం చేయాలని రాము డిమాండ్ చేశారు.

ఎన్‌టిపిసి సింహాద్రి ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి-పరవాడ : ఎన్టిపిసి సింహాద్రి సిఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా ముత్యాలమ్మపాలెం గ్రామపంచాయతీలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జాలారిపేట, వెంకటపతిపాలెం, దలాయిపాలెం, ముత్యాలమ్మపాలెం, చుట్టుపక్కల గ్రామాల నుండి 336 మంది ప్రజలు ఈ వైద్య శిబిరానికి హాజరై వైద్య సేవలు పొందారు. శిశువైద్యులు, ఆర్థోపెడిక్స్, గైనకాలజిస్టులు, జనరల్ ఫిజిషియన్లు, డెర్మటాలజిస్టులు తదితర విభాగాల డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి హెచ్ఓ పి సమీర్‌శర్మ, డీజీఎం హెచ్ఆర్ ఎస్ మహాపాత్ర, హెచ్ఆర్ మేనేజర్ కెపి.రావు, సిఎస్ఆర్ ఎగ్జిక్యూటివ్ ఎస్పి సింగ్, ముత్యాలమ్మ పాలెం సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు, ఎంపిటిసి సభ్యులు, హెల్పేజ్ ఇండియా ప్రతినిధులు పాల్గొన్నారు.

బైక్ మెకానిక్‌ల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి-అనకాపల్లి : మోటారు సైకిల్ మెకానిక్ వర్కర్ల సంక్షేమానికి కృషి చేస్తానని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ %౦% ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని మోటారు సైకిల్ మెకానిక్ వర్కర్ల సంఘం ఆత్మీయ సమావేశం శనివారం జరిగింది. ఇందులో పాల్గొన్న పీలా మాట్లాడుతూ ఎమ్మెల్యే కొణతాల, ఎంపీ సిఎం.రమేష్ సహకారంతో మోటారు కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరానికి కృషి చేస్తామని చెప్పారు. అనంతరం పీలాను సంఘం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, సంఘం సభ్యులు, భోగలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ ఎస్ఎఫ్‌ఐ సత్యనారాయణ, మారిశెట్టి శంకరరావు, ట్రాఫిక్ సిఐ వెంకటనారాయణ పాల్గొన్నారు.

వికలాంగులకు నిత్యావసర సరుకుల వితరణ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని వికలాంగుల ఆశ్రమ పాఠశాలలో వికలాంగులకు శనివారం మురళీనగర్ శ్రీసఖి సేవాసమితి సంఘ సభ్యులు బిందు రాణి ఆధ్వర్యంలో ఒక నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులను నిర్వాహకులు పిఎస్‌టి పట్నాయక్ అందజేశారు. ఆశ్రమ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం నిమిత్తం లక్ష రూపాయలు ఆశ్రమ పాఠశాల నిర్వాహకులు శివరాం సునీత ఆధ్వర్యంలో అందజేశారు.

అథ్లెటిక్స్‌లో వెటరన్ క్రీడాకారిణి ప్రతిభ

ప్రజాశక్తి-చోడవరం

గుంటూరులో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో చోడవరానికి చెందిన 85 ఏళ్ల వెటరన్ క్రీడాకారిణి ముత్యం లక్ష్మి అత్యంత ప్రతిభ చూపారు. డిస్క్ త్రో, జావెలిన్ త్రోలో రెండు బంగారు పతకాలు సాధించారు. లక్ష్మి నడక, పరుగు వంటి వాటిల్లో అనేక జాతీయ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. 85 ఏళ్ల పైబడినా నేటికీ ఉత్సాహంగా పోటీలో పాల్గొంటూ పలువురు యువతకు ఆదర్శంగా నిలుస్తుంది. బంగారు పతకాలు సాధించడం పట్ల చోడవరానికి చెందిన పలువురు ప్రముఖులు, క్రీడాకారులు ఉద్యోగులు అభినందించారు.

డిస్క్‌త్రో పోటీల్లో పాల్గొన్న ముత్యం లక్ష్మి

ప్రజలకు పారదర్శకమైన సేవలందించాలి

- మండల పరిషత్తు సమావేశంలో ఎమ్మెల్యే పంచకర్ల
- పంట నష్టం అంచనా వేయకపోవడంపై ఆగ్రహం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

ప్రజాశక్తి-సబ్బవరం

అధికారులు ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బోకం సూర్య కుమారి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో నారపాడు సర్పంచ్ మామిడి శంకర్రావు మహిళా మార్ట్ అక్రమాలు, నష్టాలపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, మహిళా మార్ట్ పనితీరుపై దర్యాప్తు చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో పి.పద్మజను ఎమ్మెల్యే ఆదేశించారు. ఇటీవల వర్షాల వల్ల పంటలు జరిగిన నష్టంపై నేటికీ అధికారులు అంచనా వేయలేదని పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వ్యవసాయశాఖ అధికారులపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే పంట నష్టం అంచనా వేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అసకపల్లి నుండి లంకెలపాలెం రోడ్డు మరమ్మతులకు ఒకే టెండర్ రావడంతో పనులు జాప్యం జరిగాయని, ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు ఆశాఖకు జమ చేశామని, త్వరలో ఈ రోడ్డు పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు శరగడం యూన్నీ లక్ష్మి రాణి, చొక్కాకుల గోవింద, పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్న గంటా, పీలా

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక కుంచావారి వీధి, విజయరామరాజుపేట గౌరీ పరమేశ్వరుల మహోత్సవం సందర్భంగా శనివారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దాడి రత్నాకర్, రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ పాల్గొన్నారు.

మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం

జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా వెలుగు డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో మండలంలోని వేచలం గ్రామంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ కూడలిలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. అనంతరం లింగ వివక్షను రూపుమాపడంలో తమ వంతు పాత్ర పోషిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి శచీదేవి మాట్లాడుతూ బాల్యవివాహాలను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎంవి సువర్ణరాజ్, వెలుగు ఏపీఎం ప్రభాకర్, ఏపీవో చంద్రశేఖర్, సర్పంచ్ నాగిరెడ్డి సెటార్ నాయుడు, ఎంపీటీసీ రెడ్డి లక్ష్మీ బలరాం, టిడిపి నాయకులు రెడ్డి శ్రీను, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

30న ఉన్నత విద్యావకాశాలపై సెమినార్

ప్రజాశక్తి-చోడవరం : గ్రామీణ విద్యార్థులు- ఉన్నత విద్య అవకాశాలు అనే అంశంపై ఉషోదయ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఈనెల 30న సెమినార్ నిర్వహిస్తున్నామని ఉషోదయ విద్యాసంస్థల ఛైర్మన్ రమణాజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ జిపి.రాజశేఖర్ సెమినార్ హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈనెల 23న చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని సుమారు 54 ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్లు తెలిపారు. దానిలో ప్రతి పాఠశాల నుండి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులకు ఒక మెమెంటో, ప్రశంసా పత్రం అందించనున్నట్లు చెప్పారు. రెండు నియోజకవర్గాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు ప్రథమ బహుమతి కింద రూ.10,000, ద్వితీయ బహుమతి కింద రూ.7,500, తతీయ బహుమతి కింద రూ.5,000 మెమెంటో, ప్రశంస పత్రం జిపి.రాజశేఖర్ చేతుల మీదగా అందజేయడం జరుగుతుందని తెలిపారు.

ఎంపిఇఒలకు ఇన్సెంటివ్ విడుదల చేయాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఎంపీఈఓలకు ఇన్సెంటివ్ విడుదల చేయాలని ఉమ్మడి విశాఖ జిల్లా ఎంపీఈఓల సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు పి.ప్రశాంత్, కె.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. మండలంలోని రాజాంలో శనివారం జరిగిన ఎంపీఈవోల సమావేశంలో వారు మాట్లాడుతూ అన్ని జిల్లాల్లోనూ ఇన్సెంటివ్‌లు విడుదల చేశారని, అనకాపల్లి జిల్లాలో మాత్రం రెండేళ్లగా విడుదల చేయలేదని తెలిపారు. తమకు గౌరవ వేతనం రూ.12వేలు మాత్రమే ఇస్తున్నారని, పదేళ్ల నుండి విధులు నిర్వహిస్తున్న తమకు వేతనం కూడా పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్సెంటివ్ వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో సీతయ్యపేట జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు ప్రాధాన్యత కలిగి ఉన్నారని స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా అధికారులు రత్నకుమారి, సోని, దివ్య అన్నారు. పాఠశాలలోని స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల ప్రతిభను శనివారం పరిశీలించిన వారు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా రత్నకుమారి మాట్లాడుతూ సీతయ్యపేట హైస్కూల్ విద్యార్థులు స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో పూర్తిగా శిక్షణ పొందారని, వారు భిన్న ప్రదేశాల్లో సహాయార్థం వాలంటీర్గా పని చేయవచ్చని తెలిపారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ లో శిక్షణ పొందిన వారికి ఉన్నత విద్యలోను, ఉద్యోగాల్లోనూ 3శాతం రిజర్వేషన్ కల్పిస్తుందని చెప్పారు. ఈ శిక్షణ అందించటం పట్ల స్కూల్ హెచ్‌ఎం జి.విష్ణుని, స్కౌట్స్ కెప్టెన్ రాజేంద్రప్రసాదిని, గైడ్ కెప్టెన్ వెంకటలక్ష్మిని జిల్లా అధికారులు అభినందించారు. అనంతరం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా అధికారులను ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది సన్మానించారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా అధికారులను సత్కరిస్తున్న దృశ్యం

పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలి

అనకాపల్లి జిల్లా ముఠా కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి రొంగలి రాము

ప్రజాశక్తి-అనకాపల్లి

పెరిగిన ధరలకు అనుగుణంగా ముఠా కార్మికులకు కూలి రేట్లు పెంచాలని అనకాపల్లి జిల్లా ముఠా కార్మిక సంఘం (సిఐటియు) ప్రధాన కార్యదర్శి రొంగలి రాము డిమాండ్ చేశారు. అనకాపల్లి ముఠా కార్మికుల సమ్మె నేపథ్యంలో శనివారం స్థానిక కాయకూరల మార్కెట్ వద్ద భీశెట్టి అప్పారావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ముఠా కార్మికులు, వర్తక సంఘం ప్రతినిధుల మధ్య శుక్రవారం కార్మిక శాఖ కార్యాలయంలో చర్చలు జరిగాయని, ఈ చర్చల్లో కార్మికులు 50శాతం నుండి తగ్గి 35 శాతానికి తగ్గడం జరిగిందని, వర్తక సంఘం ప్రతినిధులు మాత్రం రెండు శాతం మాత్రమే పెంచుతామని చెప్పడంతో చర్చలు విఫలమయ్యాయని తెలిపారు. దీంతో మూడో రోజు శనివారం కూడా సమ్మె కొనసాగినట్లు చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం, లేబర్ అధికారులు స్పందించి పెరిగిన ధరలకు అనుగుణంగా కూలిరేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. అంతవరకూ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, నాయకులు గంటా శ్రీరామ్, కాళ్ళ తెలయ్యబాబు, ముఠా కార్మిక సంఘం నాయకులు భీశెట్టి అప్పారావు, కాపుశెట్టి అప్పారావు, తిర్రే సురేష్, మహాలక్ష్మి నాయుడు, సర్వింగరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ముఠా కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి రాము

లైసెన్స్‌లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ

ప్రైవేటుకు ఇవ్వడం సరికాదు

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి-పరవాడ

మోటారు వాహనాల లైసెన్స్‌లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల ప్రైవేట్‌పరం చేయడం సరికాదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని లంకెలపాలెం ఆటో స్టాండ్ వద్ద జరిగిన సమావేశంలో గనిశెట్టి మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం మోటార్ వెహికల్ చట్ట సవరణలు చేసి ఆటో, మోటార్ కార్మికుల జీవనోపాధిని దెబ్బతీస్తుందన్నారు. ఇవే విధానాలను రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అమలు చేయడం దారుణమన్నారు. తాము అధికారంలోకి వస్తే ఆటో, మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, ఆటో కొనుగోలుకు ప్రభుత్వ బ్యాంకుల ద్వారా సబ్సిడీతో 4.లక్షలు రుణాలు మంజూరు చేస్తామని, ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15వేలు ఇస్తామని, జీవో నెంబర్ 21ను రద్దు చేస్తామని చంద్రబాబు, కూటమి నాయకులు వాగ్దానం చేశారని తెలిపారు. అధికారంలోకి వచ్చాక ఆ హామీలను అమలు చేయకుండా, లైసెన్సులు ఫిట్నెస్ సర్టిఫికెట్లు ఇచ్చే విధానాన్ని ప్రైవేటుపరం చేయడం దుర్మార్గమన్నారు. దీని వల్ల మోటారు కార్మికులపై మరింత భారం పడుతుందని, ప్రజలకు రక్షణ కరువుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే ఓలా, ఊబర్, రాపిడ్ వంటి విదేశీ యాప్‌ల వలన ఆటోలకు కిరాయిలు తగ్గిపోయాయని, ఆటో కార్మికుల కుటుంబాలు గడవలేని పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా టిడిపి కూటమి ప్రభుత్వం పునరాలోచించి ప్రభుత్వ ఆధీనంలోనే ఉంచాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. జనవరి 5న అనకాపల్లిలో జరిగే జిల్లా సదస్సును జయప్రదం చేయాలని మోటర్ కార్మికులకు గనిశెట్టి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు చౌడువాడ నరసింహారావు, ఖాతా వెంకటస్వామి, కరణం మహాలక్ష్మి నాయుడు, శెట్టి గోవిందా, పితాని రాంబాబు, కే గోవిందా, షేక్ దర్గా తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుండి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ తదితరులు

వడ్డాదిలో క్లీన్ అండ్ గ్రీన్

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఈఓపిఆర్డి పి.విజయలక్ష్మి, పంచాయితీ ఈఓ లవరాజు ఆధ్వర్యంలో శనివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్థానిక చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. వర్మీ కంపోస్ట్ నిర్వహణపై పలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ పారిశుధ్య సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు కావాలి

దేవరాపల్లి : పరిసరాల పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని మండల ప్రత్యేకాధికారి శచీదేవి అన్నారు. మండలంలోని వేచలం గ్రామంలో శనివారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో ప్రత్యేకాధికారి, ఎంపీడీవో ఎంవి.సువర్ణ రాజు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొని గ్రామంలోని వీధులను స్థానిక పారిశుధ్య కార్మికులతో కలిసి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నాగిరెడ్డి శెటారినాయుడు, ఎంపీటీసీ రెడ్డి లక్ష్మీ బలరాం, రెడ్డి శ్రీను పాల్గొన్నారు.

మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-చోడవరం : 'విధాన్ సే సమాధాన్' కార్యక్రమంలో భాగంగా జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ ఛైర్మన్, సీనియర్ సివిల్ జడ్జ్ వి.గౌరీ శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.అనంతలక్ష్మి, ఎస్సై జోగరావు, న్యాయవాది కొలగాని సతీష్ మాట్లాడారు. చట్టంలో మహిళలకు రూపొందించిన హక్కులపై అవగాహన కలిగించారు. అంగన్వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల గ్రామం చిన్న బాబు కాలనీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పి హైస్కూల్ కమిటీ ఛైర్మన్ పెతకంశెట్టి బలరామ్, టిడిపి నాయకులు పీలా బలరామ్, ఆడారి సందిన సునీల్ కుమార్, పీలా బుజ్జి పాల్గొన్నారు.

ఘనంగా ఎంపిపి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి జన్మదిన వేడుకలు స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ శ్యాం సుందర్, మండల అధికారులు, సిబ్బందితో సమక్షంలో కేక్ కట్ చేశారు. ఆమెకు, పూల బొకేలతో శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్యాం సుందర్, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎంపిపి, ఎంపిడిఒ, కార్యాలయ సిబ్బంది

'22ఎ' నుంచి భూములకు విముక్తి కల్పించాలి

ప్రజాశక్తి- పెందుర్తి : '22ఎ' నుంచి తమ భూములకు విముక్తి కల్పించి తమకు న్యాయం చేయాలని జివిఎంసి 95వ వార్డు . వరలక్ష్మీనగర్ కాలనీవాసులు వేడుకున్నారు. శనివారం చీమలాపల్లిలో నిర్వహించే రెవెన్యూ సదస్సుకు కాలనీ వాసులందరూ నిరసన తెలుపుతూ ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. దేవస్థానం భూములు, చివరకు శ్మశానవాటిక స్థలాలను సైతం 22ఎలో చేర్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తమ కాలనీ అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతూ, రెవెన్యూ సదస్సులో అధికారులకు మూకుమ్మడిగా వినతిపత్రం సమర్పించారు.

గొలుగొండ : మండలంలోని చీడిగుమ్మల గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి తదుపరి చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సత్యనారాయణ, ఆర్ఐ నాగరాజు, కొండబాబు, వీఆర్వోలు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు భీమిరెడ్డి సత్యనారాయణ, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు కామరెడ్డి గోవిందు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని అమృతపురం పంచాయతీ, చింతగట్ల అగ్రహారంలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై 3 అర్జీలు అందినట్లు భూ రీ సర్వే డిటి ఎం.గణపతిరావు తెలిపారు. ఈ అర్జీలను దర్యాప్తు చేసి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బైలపూడి గౌరీ రామారావు, ఎంపీటీసీ సింగంపల్లి శ్రీనివాసరావు, ఆర్ఐ వీరయ్య, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, వెలుగు సర్వేయర్ రాంబాబు, వీఆర్వో పి.జగన్నాథరావు, విలేజ్ సర్వేయర్లు ధనశేఖర్, ఆదిత్య, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని చిట్టియ్య పాలెంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామస్తుల నుండి రెవెన్యూ అధికారులు ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రవణ్, స్థానిక నాయకులు వి.చిన్న, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జగన్ అవినీతి వల్లే విద్యుత్ ఛార్జీల భారాలు : టిడిపి

ప్రజాశక్తి-అనకాపల్లి : జగన్మోహన్‌రెడ్డి సెకీ ఒప్పందం వల్ల అదానీ ద్వారా రూ.1750 కోట్లు అవినీతికి పాల్పడ్డారని, ఆ ఒప్పంద మూలంగా విద్యుత్ రంగంలో తెచ్చిన అప్పులకు పడిన వడ్డీ వల్లే విద్యుత్ వినియోగదారులపై భారం పడింది తప్ప కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచలేదని టిడిపి నాయకులు విమర్శించారు. ఈ మేరకు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగ జగదీశ్వరరావు, టిడిపి జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు, అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ శనివారం రెండు వేర్వేరు విలేకర్ల సమావేశాల్లో వారు మాట్లాడారు. తన పాలనలో విద్యుత్ వినియోగదారులపై పదిసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి 1.30 లక్షల కోట్లు భారాలు మోపిన వ్యక్తి విద్యుత్ ఛార్జీల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని పేర్కొన్నారు. విద్యుత్ ఛార్జీల పెంచిన దానిపై బహిరంగ చర్చకు వైసిపి నాయకులు చేతనైతే ముందుకు రావాలని నాగ జగదీష్ సవాల్ విసిరారు. ఈ విలేకర్ల సమావేశంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ, టిడిపి కార్యదర్శి కుప్పిలి జగన్, 81వ వార్డు అధ్యక్షులు మారిశెట్టి శంకర్రావు, నాయకులు కొణతాల కరుబాబు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తాం

-హోం మంత్రి వంగలపూడి అనిత- మెగా జాబ్‌మేళాలో 826 ఎంపిక

ప్రజాశక్తి- నక్కపల్లి:కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రంలో అనేక పరిశ్రమలు రాబోతున్నాయని, నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. పాయకరావుపేట శ్రీ ప్రకాష్ స్పేసెస్ డిగ్రీ కాలేజీలో శనివారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధికల్పన సంస్థ, సీడాప్ సంయుక్తంగా నిర్వహించిన మెగా జాబ్ మేళాను కలెక్టర్ విజయ కృష్ణన్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ, తల్లిదండ్రులు కూలి పనులు చేస్తూ ఆర్థిక స్తోమత లేక పోయినా తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నారన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని దృష్టిలో పెట్టుకొని ఉన్నతంగా చదువుకొని ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు. ఎన్నికల ప్రచారంలో యువతకు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చానని, హామీ మేరకు మెగా జాబ్ మేళా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు వస్తే తమ పిల్లలకు మంచి భవిష్యత్ ఉంటుందని రైతులు తమ విలువైన భూములు ఇచ్చారన్నారు. గత ఐదు సంవత్సరాల్లో పాయకరావుపేట నియోజకవర్గంలో ఒక కంపెనీ కూడా రాలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పెద్ద సంఖ్యలో కంపెనీలు తరలివస్తున్నాయన్నారు.ముఖ్యంగా స్టీల్ ప్లాంట్ రాబోతుందని వెల్లడించారు. మరో 3 నెలల్లో మరల మెగా జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు.

ఈ మెగా జాబ్ మేళా కు 53 జాతీయ, బహుళ జాతీయ కంపెనీలు హాజరయ్యాయని, 2750 అభ్యర్థులు హాజరుకాగా, వీరిలో 826 మందిని ఎంపిక చేశారని, వీరిలో 300 మందికి అప్పటికప్పుడే ఉద్యోగ నియామక పత్రాలను అందజేశామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్.గోవిందరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా కంపెనీల ప్రతినిధులు, జాబ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎ .కళ్యాణి, డిఆర్డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ సచీదేవి, శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్, ఆర్‌డిఓ రమణ, పలువురు అధికారులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అనిత

పాఠశాలను తనిఖీ చేసిన హోం మంత్రి అనిత

నక్కపల్లి:నక్కపల్లి గురుకులం పాఠశాలను శనివారం హోం మంత్రి వంగలపూడి అనిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకులంలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై మంత్రి ఆరా తీశారు. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతను స్వయంగా పరిశీలించి,విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వసతి సౌకర్యంపై విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సువర్ణ కుమారి, ఉపాధ్యాయులు,నాయకులు పాల్గొన్నారు.

వినతిపత్రాన్ని ఇస్తున్న సంఘం సభ్యులు

స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి -కొత్తకోట:మేజర్ పంచాయతీ కొత్తకోట లో బుద్ధుడు మందిరం నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరుతూ శనివారం స్థానిక అంబేద్కర్ యువజన సేవా సంఘం సభ్యులు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యనిర్వహణాధికారి (ఈవో) జ్యోతిశ్వర రెడ్డికి వినతిపత్రం అందజేసినట్టు ఆ సంఘం సభ్యులు మల్లేటి రాజు, బి.బుల్లిబాబు, పూడి అప్పారావు, ఎంపిటిసి సభ్యులు పూడి దేవ తదితరులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలో బి ఎన్ రోడ్డుకు సమీపంలో పశు వుల ఆసుపత్రికి ఎదురుగా ప్రపంచ శాంతికి కృషి చేసిన శాంతి దూత గౌతమ్ బుద్ధుడు విగ్రహంతో పాటు మందిరం నిర్మాణం చేయడానికి సర్వే నెం 140-1లో సుమారు మూడు సెంట్లు స్థలం కేటాయించాలని కోరారు. ఈ స్థలం లో గత ఎనిమిదేళ్లగా మందిరం నిర్మాణం చేపట్టాలన్న సంకల్పంతో ఉన్నట్టు వారు చెప్పారు. దీనికి పంచాయతీ తీర్మానం చేసి నిర్మాణానికి సహకరించాలని పంచాయతీ ఈవో ను కోరినట్టు వివరించారు.దాతల సాయం తో జనవరి లో నిర్మాణ పనులు చేపడుతున్నట్టు వారు పేర్కొన్నారు.

చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

చెత్తా చెదారం తొలగింపు

ప్రజాశక్తి- రావికమతం:మండల కేంద్రంలో ఎంపీడీవో వెంకన్న బాబు, ఎక్స్టెన్షన్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. డ్రై డేను ప్రజల భాగస్వామ్యంతో చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కృష్ణమోహన్, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

గొలుగొండ:గొలుగొండ మండలం జోగంపేట సెంటర్‌లో శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రోడ్లకు ఇరువైపులా చెత్తను తొలగించారు. అనంతరం ఇన్‌ఛార్జ్ ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి శనివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం కరుణానిధి, పంచాయతీ కార్యదర్శులు నాగేంద్ర కుమార్, పవన్ కుమార్, స్వచ్ఛతాహీ సేవ మండల కోఆర్డినేటర్ పడాల మాధవరావు పాల్గొన్నారు.

సాఫీగా మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ మండల పరిషత్ సమావేశం మందిరంలో శనివారం ఎంపీపీ గజ్జలపు మణికుమారి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు వివిధ సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. సమస్యలు చెబుతున్నా పరిష్కారం కావడం లేదన్నారు. పీహెచ్ సి వైద్యాధికారి శ్యామ్ మాట్లాడుతూ..గ్రామాల్లో జ్వరాలు ప్రబలకుండా శానిటేషన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మేరీరోజ్, వైస్ ఎంపీపీ ఆదినారాయణ, డిటి చైన్లు తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండలో మాట్లాడుతున్న ఎంపిపి

మండల సమావేశం వాయిదా

కోటవురట్ల: మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతితో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఏడు రోజుల సంతాప దినములో భాగంగా శనివారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు తెలిపారు, ఈ సందర్భంగా సభ్యులు, అధికారులు మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అప్పలనాయుడు, తహసిల్దారు తిరుమల బాబు, దత్తుడురాజు పాల్గొన్నారు.

కోటవురట్లలో నివాళులర్పిస్తున్న అధికారులు, నేతలు

సబ్సిడీపై సౌర విద్యుత్ పరికరాలు

ప్రజాశక్తి- కోటవురట్ల:గృహ విద్యుత్ వినియోగదారులు సొంత గృహాలకు సబ్సిడీపై అందిస్తున్న సౌర విద్యుత్ పరికరాలను అమర్చుకోవాలని ఈపీడీసీఎల్ ఎస్ఇ, మండల ప్రత్యేక అధికారి ప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో గృహ విద్యుత్ వినియోగదారులంతా కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న సోలార్ విద్యుత్ ప్యానెల్ ను అమర్చుకోవాలన్నారు జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 4797 దరఖాస్తులు అందాయని 303 మంది వినియోగదారులకు విద్యుత్ ప్యానెల్స్ అమర్చినట్లు తెలిపారు. మండలం నుంచి 68 దరఖాస్తులు అందగా 9 చోట్ల ఇప్పటికే ప్యానల్స్ అమర్చినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 1 కె.వి ప్యానెల్ కు 75000 అవుతుండగా 35000 సబ్సిడీ అందిస్తుందని, 2కె వికి 135000కి 60000 సబ్సిడీ, 3కెవికి రెండు లక్షలకు గాను 78000 సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. అవసరం అనుకుంటే బ్యాంకు నుంచి 7 శాతం వడ్డీకి రుణాలు కూడా అందిస్తారని, 25 సంవత్సరాల వారంటీతో వీటిని అమరుస్తున్నట్లు తెలిపారు ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగంచుకోవాలన్నారు.సాంప్రదాయ ఇంధన వనరును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆసుపత్రిలో మొక్కలు నాటివేత

ప్రజాశక్తి-మాడుగుల:మాడుగుల ప్రభుత్వ ఆసుపత్రిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా "పల్లెవనం " కార్యక్రమాన్ని శనివారం ఎపిఓ మురళి కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆసుపత్రి ఆవరణలో కొబ్బరి, మామిడి, నేరేడు, ఉసిరి, నిమ్మ, జామ వంటి 102 మొక్కలు నాటి మధ్యలో జాగింగ్ ట్రాక్ నిర్మాణం కూడా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజారామ్, మాజీ ఎంపీపీ పెదబాబు, కూటమి నాయకులు రంజిత్ వర్మ, సూర్యానారాయణ వర్మ , మరువాడ ఈశ్వరరావు, నానాజీ, సూపర్ వైజర్ శ్రీను, ఫీల్డ్ అసిస్టెంట్ పాపయమ్మ పాల్గొన్నారు.

నాటుతున్న అధికారులు, నాయకులు

విద్యలో రాణిస్తే ఉన్నత భవిష్యత్తు

- సిఎస్ఆర్ ప్రతినిధి సుధాకర్

ప్రజాశక్తి -నక్కపల్లి:విద్యార్థులు విద్యలో రాణిస్తేనే ఉన్నత భవిష్యత్తు ఉంటుందని హెటిరో కంపెనీ సిఎస్ ఆర్ ప్రతినిధి ఎన్.సుధాకర్ తెలిపారు. హెటిరో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ బండి పార్థసారథి రెడ్డి సూచనలు మేరకు జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు చే తయారు చేసిన స్టడీ మెటీరియల్, 2023-24 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహం పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నక్కపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వేదికగా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సిఎస్ఆర్ ప్రతినిధి సుధాకర్, కంపెనీ ప్రతినిధి ఎస్ కుల్లా రెడ్డి మాట్లాడారు. కంపెనీ చైర్మన్ ఉన్నత చదువులు చదువుకుని, పరిశ్రమ ఏర్పాటు చేసి తామందరికీ ఉపాధి కల్పించడంతోపాటు, అనేక సేవా, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. విద్య, వైద్యాభివృద్ధిలో కంపెనీ యాజమాన్యం ఎల్లప్పుడూ సహాయ, సహకారాలు అందిస్తూనే ఉంటుందన్నారు. స్థానిక 50 పడకల ఆసుపత్రికి సుమారుగా కోటి రూపాయల నిధులతో వైద్య పరికరాలు అందజేయడం జరిగిందన్నారు. డిప్యూటీ డీఈవో అప్పారావు, ఎంఈఓలు నరేష్, వేమగిరి సూరజారాజు మాట్లాడుతూ,2009 నుండి హెటిరో యాజమాన్యం పదవ తరగతి విద్యార్థులకు ఎంతో విలువైన స్టడీ మెటీరియల్‌ను అందజేయడం అభినందనీయమన్నారు. తమ విజ్ఞప్తి మేరకు మండలంలో అన్ని పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసినందుకుగాను కృతజ్ఞతలు తెలిపారు. నక్కపల్లి లో మండల విద్యాశాఖ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, భవనం నిర్మించి ఫర్నిచర్ ఏర్పాటు చేయాలని కోరారు. నక్కపల్లి హైస్కూల్ హెచ్ఎం రాణి లలిత మాట్లాడుతూ స్టేజ్ నిర్మాణం చేపట్టాలని కోరారు. అనంతరం కంపెనీ ప్రతినిధులు సుబ్బారెడ్డి, కుల్లారెడ్డి, రాజారెడ్డి,వీర వెంకట సత్యనారాయణ రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. 2023-24 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రథమ, ద్వితీయ,తృతీయ స్థాయి విద్యార్థులకు 10 వేలు, 7 వేల 5 వందలు, 5 వేలు రూపాయలు చొప్పున నగదును అందజేసారు. 1200 మంది విద్యార్థులకు 4 లక్షలతో స్టడీ మెటీరియల్, 40 మంది విద్యార్థులకు 4 లక్షల రూపాయలు నగదు ప్రోత్సాహం కింద అందజేయడం జరిగిందని కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. కంపెనీ ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ టీం ప్రతినిధులు సిహెచ్ అరుణ్ కుమార్ రెడ్డి, సిహెచ్ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు రాణిలలిత, గురుకుల పాఠశాల ప్రిన్స్‌పాల్ సువర్ణకుమారి, ప్రధానోపాధ్యాయులు డి.సత్యారావు, నారాయణరావు, త్రినాధరావు, సత్యనారాయణ, గురుకుల పాఠశాల ప్రిన్స్‌పాల్ సువర్ణకుమారి, కె.జీ.బీ వీ ఎస్.వో. సలీమా ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, డివి సన్యాసిరావు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న సుధాకర్

పనులు అడ్డగించిన గ్రామస్తులు, సిపిఎం నేతలు

కారిడార్ రోడ్డు పనులు అడ్డగింత

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని రాజయ్యపేటలో వైజాగ్- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా ఆధ్వర్యంలో రోడ్డు పనులు చేపడుతుండగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్ ఆధ్వర్యంలో గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, నిర్వాసితులకు పూర్తిస్థాయిలో ప్యాకేజీ, పరిహారం చెల్లించకుండా పనులు ఎలా చేపడతారని ప్రశ్నించారు. భూములు కోల్పోయిన రైతులకు రైతులపై ఆధారపడి జీవిస్తున్న కూలీలు, వృత్తిదారులు, దళితులు, సముద్రమే జీవనాధారంగా జీవిస్తున్న మత్స్యకారులకు పూర్తిస్థాయిలో భూములకు పరిహారం, ప్యాకేజీ చెల్లించకుండా పనులు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇల్లులు కోల్పోతున్న వారికి ఎక్కడ పునరావాసం కల్పిస్తారో, ప్యాకేజీ, పరిహారం ఎంత చెల్లిస్తారో తెలియజేయకుండా, చెల్లించకుండా పనులు ఎలా చేపడతారని ప్రశ్నించారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా, న్యాయం చేయకుండా జనవరి 8 తేదీన ప్రధానమంత్రి మోడీ స్టీల్ ప్లాంట్, బల్క్ డ్రగ్ యూనిట్‌కు ఎలా శంకుస్థాపన చేస్తారన్నారు. కాకినాడ ప్రాంతంలో అక్కడ ప్రజలు తిరస్కరించిన బల్క్ డ్రగ్ యూనిట్‌ను ఈ ప్రాంతంలో నెలకొల్పి ఈ ప్రాంత ప్రజల అనారోగ్యాల పాలు చేయొద్దన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, స్థానిక హెూం మంత్రి ప్రత్యేక దృష్టి సారించి నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నిర్వాసితులు పాల్గొన్నారు.

కేలెండర్ ఆవిష్కరిస్తున్న హెూం మంత్రి అనిత

శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- నక్కపల్లి:పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యాసంస్థలో శనివారం ప్రముఖ వ్యాపారవేత్త రతన్ టాటా జయంతి సందర్భంగా శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల 2025 వార్షిక కేలండర్‌ను హెూం మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, జాబ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎ.కల్యాణి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గోవిందరావు, శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్ తదితరులు ఆవిష్కరించారు. టాటా కుటుంబం ఆధునిక భారతదేశానికి నిజమైన నిర్మాతలని ఈ సందర్భంగా తెలిపారు. భారతదేశపు మొట్టమొదటి అంతర్జాతీయ విమానయాన సంస్థ, ఎయిర్ ఇండియాను పరిచయం చేయడమే కాకుండా టాటా కుటుంబం వ్యాపారం ఒక దేశ ప్రగతి, మంచి కోసం ఎలా ఉపయోగపడుతుందో చూపించారన్నారు. ఉద్యోగాలు సంపదను సృష్టించడమే కాకుండా వారి ఉన్నత విలువలతో సమాజం పట్ల శ్రద్ధతో నడిపించడానికి ఇతరులను కూడా అనేక అంశాలలో ప్రేరేపించారని, వారి దేశ నిర్మాణ స్ఫూర్తి భారతదేశానికి గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్ తెలిపారు.

పట్టుబడ్డ గ్రావెల్ లారీ

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో ఎండపల్లి గ్రామం నుండి శుక్రవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ లారీని పట్టుకుని స్టేషన్కు తరలించినట్లు స్థానిక ఎస్సై రమేష్ తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనుమతి లేకుండా గ్రావెల్, ఇసుక, మట్టి, వంటి వాటిని అక్రమ రవాణా చేపడితే చర్యలు తప్పవన్నారు.

సిపిఎం జిల్లా మహాసభ దృశ్యాలు

సిపిఎం విశాఖ జిల్లా మహాసభ శనివారం ఉత్సాహంగా ప్రారంభమైంది. పెందుర్తి నుంచి సుజాత నగర్ వరకూ భారీ ర్యాలీ చేపట్టి అక్కడ బహిరంగ సభ నిర్వహించారు. కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నేతల ప్రసంగాలు ఆలోచింపజేశాయి. ఆద్యంతం ఈ మహాసభ ఉత్తేజంగా సాగింది.

పూలవర్షంతో స్వాగతం పలుకుతున్న మహిళలు

అమర వీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

కవాతు నిర్వహిస్తున్న మహిళలు

డ్యాన్స్ చేస్తున్న కళాకారులు

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

కోలాటం ఆడుతున్న మహిళలు

తీరప్రాంత మత్స్యకారుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలి

-ఐఎఎస్ మాజీ అధికారి ఇఎఎస్.శర్మ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆదివాసీ ప్రాంతాలలో అమలులో ఉన్న పీసా, అటవీ హక్కుల చట్టాల మాదిరిగా తీర ప్రాంత మత్స్యకారుల హక్కుల రక్షణ కోసం ప్రత్యేకంగా ఒక చట్టాన్ని రాష్ట్రంలో తీసుకురావాలని రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. 2009లో కేంద్రంలో అధికారంలో ఉన్న యుపిఎ ప్రభుత్వం మత్స్యకారుల హక్కుల పరిరక్షణ విషయంలో ది ట్రెడిషనల్ కోస్టల్ అండ్ మెరైన్ ఫిషర్ ఫోక్ (ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్) బిల్లును ప్రతిపాదించిందని, అయితే అప్పటి యుపిఎ ప్రభుత్వం దాని విషయంలో ముందుకు వెళ్లలేదని తెలిపారు. అటువంటి చట్టం మన రాష్ట్రంలో అమలు చేయడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. తీర ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణ నిబంధనలను అమలు చేయడమే కాకుండా, సంప్రదాయ మత్స్యకారుల సంక్షేమం దృష్ట్యా, వారి శివార్లలో ప్రత్యేకమైన అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టడం అవసరం అని తెలిపారు. అందుకు కావలసిన నిధులను, ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ తీరులో కేటాయించి చట్టపరంగా స్థానిక మత్స్యకారుల పర్యవేక్షణలో అమలు చేయవలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. మన రాష్ట్రంలో 974 కిలోమీటర్ల సముద్ర తీరం ప్రాంతంలో 555 మత్స్యకారుల శివార్లు ఉన్నాయని, వాటిలో 6 లక్షలా 5 వేల సంప్రదాయ మత్స్యకారులు నివసిస్తున్నారని తెలిపారు. ఉపాధి కోసం సముద్ర తీర ప్రాంతంలో మత్స్యసంపద మీద వారు ఆధారపడతారని తెలిపారు. మత్స్యకారుల శివార్లలో సరైన అభివృద్ధి సౌకర్యాలు లేవని వివరించారు. పైగా తీర ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణ నిబంధనలు ఉల్లంఘన కారణంగా అక్కడ ఉన్న పరిశ్రమల కాలుష్యం, మత్స్య సంపదకు నష్టం కలిగిస్తుందని తెలిపారు. దీనివల్ల మత్స్యకారులు ఉపాధి కోల్పోతున్నారని పేర్కొన్నారు.

అదిరిన నావికా దళ విన్యాసాల రిహార్సల్

హెలీకాప్టర్‌లో విన్యాసం

పారాచ్యూట్‌లో విన్యాసం



సముద్రంలో రంగులు గుప్పిస్తున్న సైనికులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : తూర్పు నావికాదళం ఏటా నిర్వహించే నేవీ డే వేడుకలను ఈ ఏడాది డిసెంబర్ 4న పూరీ వేదికగా నిర్వహించారు. విశాఖ వాసుల అభ్యర్ధనల మేరకు 2025 జనవరి 4 విశాఖలో నేవీ డే వేడుకలను మరో సారి నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం నుంచి ఆర్కే బీచ్ వద్ద నావికాదళ విన్యాసాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు జరిగిన విన్యాసాల్లో తూర్పు నావికాదళానికి చెందిన హాక్ యుద్ధ విమానాలు, చేతక్ హెలికాప్టర్లు, యుద్ధనౌకలు, సబ్ మెరైన్లు పాల్గొన్నాయి. ఈ విన్యాసాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఆదివారం కూడా ఈ రిహార్సల్ నిర్వహిస్తారు. జనవరి 2న ఆపరేషనల్ డెమో, జనవరి 4, సాయంత్రం 4 గంటల నుండి ఫైనల్ ఆపరేషనల్ డెమో ఉంటాయి. జనవరి 4వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకానున్నారు.

సమావేశమైన అధికారులు

మండల కమిటీ సమావేశం

ప్రజాశక్తి -కోటవురట్ల: ఎంపీడీవో కార్యాలయంలో మండల లెవెల్ కోఆర్డినేషన్ కమిటీ మండల ప్రత్యేక అధికారి ప్రసాద్, తహసిల్దార్ తిరుమల బాబు, ఎంపీడీవో కాశీ విశ్వనాధ రావు, స్థానిక ఎస్సై రమేష్ శనివారం సమావేశం నిర్వహించారు. టి జగ్గంపేట గ్రామస్తుడు అప్పల నాయుడు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన భూసమస్యను పరిష్కరించేందుకు సమావేశమయ్యారు.కాగా సమస్య పరిష్కారానికి ఇరువురిని కమిటీ సభ్యులు పిలిపించగా వేనమ్మ బాలింత కావడంతో హాజరు కాలేదు. కమిటీ సభ్యులు ఫోన్ ద్వారా సమాచారం అందించి వచ్చే నెల నాలుగవ తేదీన హాజరు కావాలని ఆమెకు సూచించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి- నక్కపల్లి:గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబు పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్ట్రియల్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి, స్థానిక ఎంపీడీవో డి సీతారామరాజు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులతో కలిసి దాడిని ఖండిస్తూ నిరసన తెలిపారు. దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని, ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.

మధ్యాహ్న భోజన సామగ్రి కొనుగోలు

ప్రజాశక్తి- కోటవురట్ల: వచ్చే ఏడాది మూడో తారీకు నుంచి జూనియర్ కళాశాలలో మొదలుకానున్న మధ్యాహ్న భోజన పథకానికి విద్యార్థులకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. సుమారు 250 మందికి అవసరమయ్యే 45 వేల రూపాయలు విలువగల ప్లేట్లు, గ్లాసులు లు కళాశాల అభివృద్ధి నిధుల నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా 1974- 75 బ్యాచ్ విద్యార్థులు హాట్ డిష్ అందించినట్లు ఆమె అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రామారావు, ఎంఈఓ 2 జోష్, పాల్గొన్నారు.

సామగ్రి చూపుతున్న ప్రిన్సిపల్